## త్వరలో తెలుగు రాష్ట్రాలకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

**ప్రధాని నరేంద్రమోడీ విశాఖ పర్యటన సందర్భంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటన**



మెట్టుగూడ, నవంబర్ 13 ప్రభాతవార్త: సికింద్రాబాద్ టు విజయవాడ మధ్య వందే భారత్ రైలు త్వరలో ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. దీంతో ప్రయాణ సమయం తగ్గనుంది. ప్రయాణికుల రద్దీ భారీగా ఉండే సికింద్రాబాద్... విశాఖ, సికింద్రాబాద్ తిరుపతి... కాచిగూడ.. బెంగుళూరు... హైదరాబాద్... ముంబై మార్గాలను మొదట అధికారులు పరిశీలించారు. కానీ వందే భారత్ రైల్లో బెర్తులకు అవకాశం ఉండదు కూర్చొని ప్రయాణం చేయాల్సి ఉండటంతో విజవాడ వరకు పరిమితం చేయాలని అధికారులు ప్రతిపాదనలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఇప్పటికే కేంద్ర రైల్వే శాఖ నుంచి దక్షిణ మధ్యరైల్వేకు సమాచారం అందినట్లు సమాచారం. రూటుపైనా తుది నిర్ణయం తీసు కోవాల్సి వుందని తెలుస్తోంది. అధికారికంగా రూటు ప్రకటించకపోయినా సికింద్రాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు త్వరలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వస్తోందంటూ కేంద్రమంత్రి ఆదివారం ప్రకటించారు. సికింద్రాబాద్ నుంచి విజయవాడ, అదేవిదంగా సికింద్రాబాద్ టు విశాఖ, దీంతో పాటుగా సికింద్రాబాద్ టు తిరుపతి ఈ మూడు లైన్లలో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. ముఖ్యంగా సికింద్రాబాద్ టు విజయవాడ మధ్య ఈ రైలు జనవరి 1వ తేది నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. రోజుకు 25వేల మందికి పైగా ప్రయాణికులు సికింద్రాబాద్..విజయవాడ మధ్య రాకపోకలలు సాగిసున్నప్పటికి ఈ రెండు నగరాల మధ్య ప్రయాణికులు డిమాండ్ భాగానే ఉంది. దీంతో తక్కవ సమయం అనగా నాలుగు గంటల్లోపే రెండు రాజధానుల మధ్య రాకపోకలు సాగించేందుకు వీలుగా వందే భారత్‌కు ప్రవేశపెడుతున్నారు. ఇదిలా ఉండగా సికింద్రాబాద్ మీది నుంచి ఖాజీపేట్ మీదుగా విజయవాడ మార్గాన్ని హైడెన్సిటీ నెట్ వర్క్ పరిధిలోకి తీసుకు వచ్చారు. 130కి.మీ కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించేందుకు వీలుగా ట్రాక్ సామర్థ్యాన్ని పెంచారు.

## ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో నిందితుడు నందకుమార్‌కు షాక్

**ప్రాపర్టీ కూల్చివేసిన జిహెచ్ఎంసి**





హైదరాబాద్, నవంబరు 13 ప్రభాత వార్త : ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో నిందితుడిగా ఉన్న నందకుమార్‌కు చెందిన అక్రమ నిర్మాణాలను జిహెచ్ఎంసి అధికారులు కూల్చివేశారు. ఫిల్మ్ నగర్‌లోని హోటల్ దక్కన్ కిచెన్‌లో కొంత భాగాన్ని జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబుకు చెందిన స్థలాన్ని నందకుమార్ లీజుకు తీసుకున్నారు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా దక్కన్ కిచెన్ ప్రాంగణంలో రెండు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. అధికారులు అనేకసార్లు నోటీసులు ఇచ్చినా పనులు అపకుండా కొనసాగిస్తుండటంతో ఆదివారం కూల్చివేతలను చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు మధ్య అక్రమ నిర్మా ణాలను కూల్చివేశారు. నందకుమార్ స్థలాన్ని లీజుకు తీసుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడని, అందువల్లే కూల్చివేస్తున్నామని జిహెచ్ఎంసి అధికారులు తెలిపారు. కోర్టు ఆదేశాలతోనే తాము అక్రమ నిర్మాణాలను కూల్చివేయించామని అధికారులు తెలియజేశారు. అయితే భవనం కూల్చివేతను నందుకుమార్ భార్య చిత్ర అడ్డుకున్నారు. తమ లీజు ల్యాండ్‌లో అక్రమంగా కూల్చివేతలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే భవనం కూల్చివేశారంటూ ఆరోపించారు. అన్ని ఆధారాలను అధికారులకు అందిస్తామని చిత్ర తెలిపారు.ఎమ్మెల్యేల కొనుగోళ్ల కేసులో దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు మరిన్ని ఆధారాల కోసం శనివారం రాత్రి నుంచి నందకుమార్ ఇంటితోపాటు ఆయన నిర్వహిస్తున్న డెక్కన్ హోటల్‌లోనూ తనిఖీలు చేయగా అక్రమ నిర్మాణాల విషయం బయటపడింది. దీంతో ఆదివారం ఉదయమే జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ సిబ్బంది నోటీసులు ఇచ్చినా.. నిర్మాణ పనులు ఆపకుండా కొనసాగించారు. దీంతో జిహెచ్ఎంసి సిబ్బంది జేసీబీలను తీసుకొచ్చి కూల్చివేతలు చేపట్టారు.

## భార్య వివాహేతర సంబంధం..
# వేధనతో భర్త బలవన్మరణం

**సెల్ఫీ వీడియోలో భార్య ప్రవర్తన గురించి వివరించిన భర్త**

**తన పిల్లల జీవితాలు కాపాడాలని పోలీసులకు విజ్ఞప్తి**

**నాగాంజలి, స్వరూప్‌రెడ్డిపై మృతుడి తండ్రి ఫిర్యాదు**

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన**



మృతుడు శేఖర్ (ఫైల్ ఫోటో)



విలపిస్తున్న మృతుడి తల్లిదండ్రులు

ఎల్.బి.నగర్, నవంబర్, 13 ప్రభాతవార్త : భార్య అక్రమ సంబంధం పెట్టుకుందని తట్టుకోలేని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. తన పిల్లలు అనాధలు కాకుండా కాపాడాలని సెల్ఫీ వీడియోలో మృతుడు పోలీసులను వేడుకున్నాడు. ఈ సంఘటన సరూర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సరూర్‌నగర్‌లో నివాసం ఉండే గూడూరు శేఖర్(35) సెల్ఫీ వీడియో తీసుకొని ఈనెల 8వ తేదీన బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గూడూరు శేఖర్‌తో మురుపాకుల ఏడుకొండలు పెద్దకూతురై నాగాంజలితో 2014 ఫిబ్రవరి 14న వివాహం జరిగింది. వీరికి ఒకకూతురు, ఒకకుమారుడు ఉన్నారు. నాగాంజలి హైదరాబాద్ కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయములో పని చేస్తూ ఈ సవంత్సరం జనవరిలో ఆదిలాబాద్‌కు బదిలీ అయింది. కాగా 2019 సవంత్సరం నుండి తేజస్వరూప్‌రెడ్డి అనే వ్యక్తితో చనువుగా ఉండడాన్ని భర్త రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని నిలదీయగా, తప్పు ఒప్పు కుని పెద్దల సమక్షంలో భవిష్యత్తులో తప్పు పునరావృతం కాదని క్షమాపణ కోరింది. అయితే ఆదిలాబాద్ బదిలీ అయిన వెంటనే స్వరూప్‌రెడ్డితో కలిసి ఆదిలాబాద్‌లో వారిద్దరూ సహజీవనం కొనసాగించడం శేఖర్‌కు మింగుడు పడలేదు. భార్య అక్రమ సంబంధంతో తీవ్ర మనస్థాపానికి గురైన శేఖర్ ఈ నెల 8న మధ్యాహ్నం విషంతాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ఆత్మహత్యకు పాల్పడ్డ శేఖర్‌ను ప్రయివేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ నవంబర్ 9వ తేది రాత్రి శేఖర్ తుది శ్వాస విడిచాడు. కాగా తన కొడుకు శేఖర్ మృతికి కారకులైన నాగాంజలి, అదిలాబాదులో నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న తేజస్వరూప్‌రెడ్డిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తండ్రి గూడూరు శంభయ్య 9వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆత్మహత్యకు ముందు శేఖర్ తన ఆవేదనను భార్య గురించి సెల్ఫీవీడియోలో వివరిస్తూ కన్నీటిపర్వతం అయ్యాడు. ఎవరి వలన అయితే తమ కుమారుడు బలవన్మరణానికి పాల్పడ్డాడో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తన కుమారుడిలాగా మరెవ్వరికి ఇలాంటి దుస్థితి రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదులో కోరారు. కుమారుడు శేఖర్ మరణంతో కుటుంబ సబ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగా నాగాంజలి తల్లిదండ్రులు ఏడుకొండలు, మల్లేశ్వరి, స్వరూప్‌రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేటి నుంచి సాలార్‌జంగ్ మ్యూజియంలో బాలల వారోత్సవాలు

చార్మినార్, నవంబరు 13 ప్రభాతవార్త : సాలార్‌జంగ్ మ్యూజియంలో ఈ నెల 14వ తేదీ సోమవారం నుంచి బాలల వారోత్సవాలు ప్రారంభం కానున్నాయని మ్యూజియం డైరెక్టర్ డాక్టర్.నాగేందర్‌రెడ్డి తెలిపారు.జంట నగరాలకు చెందిన పాఠశాలల విద్యార్థులను సీనియర్,(9,10 తరగతుల విద్యార్థులు) జూనియర్ (6,7,8తరగతులు విద్యార్థులు) విభాలుగా విభజించి వ్యాసరచన,వక్తృత్వం,డ్రాయింగ్ పోటీలను జరుపుతున్నామని ఆయన తెలియజేశారు.నవంబరు నెల 15న వ్యాస రచన,16న వక్తృత్వం, 17న డ్రాయింగ్ పోటీలు తెలుగు హిందీ,ఇంగ్లీషు,ఉర్దూ భాషలలో ఉంటాయని ఆయన తెలిపారు. పోటీలలో గెలు పొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేయనున్నామని ఆయన తెలియజేశారు

## బాలాజీ మందిరంలో అన్నకూట్ మహోత్సవం

చార్మినార్, నవంబరు 13 ప్రభాతవార్త : కార్తీక మాసం సందర్భంగా ఆదివారం చార్మినార్ సమీపంలోని చౌక్ మైదాన్ శ్రీ బాలాజీ మందిరంలో అన్నకూట్ మహోత్సవం జరిగింది.ఈ కార్యక్రమంలో మందిరం ట్రస్టీలు రాజు పిత్తి, గోవింద పిత్తి, వ్యాపార వేత్త శ్రీనివాస్ బన్సల్, బిజెపి నాయకులు పవన్ మిశ్ర, అనిల్ బజాజ్‌తో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు శ్రీ వెంకటేశ్వర స్వామిక్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# హైదరాబాద్ వార్త

## పాతబస్తీకి మెట్రో దారులెన్నడో?

**నిధుల కొరతతో ముందుకు పడని అడుగు**

**సర్వేలో భూగర్భంలో పైపులు, కేబుళ్ల గుర్తింపు**

**ఎంజీబిఎస్ నుంచి**

**పలక్‌నుమా వరకు పూర్తిచేయాల్సింది 5.5 కి.మీ**



హైదరాబాద్, నవంబరు 13 ప్రభాతవార్త : పాతబస్తీ వరకు మెట్రో రైలు నిర్మాణానికి ఎంత కాలం పడుతుంది? ఎన్నికల లోపు ప్రభుత్వం పూర్తిచేయగలదా? పనులు ఎప్పుడు మొదలెట్టినా మూడేళ్ల పడుతుందని మెట్రో ఇంజినీర్లు అంటున్నారు. తొలిదశ మెట్రోలో జేబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. అలైన్‌మెంటగ్ వివాదాలతో జేబీఎస్ నుంచి ఎంజీబిఎస్ వరకే నిర్మించారు. ఎంజీబిఎస్ నుంచి పలక్‌నుమా వరకు 5.5కి.మీ పూర్తి చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఎప్పుడు ఆదేశిస్తే అప్పుడు పనులు మొదలెట్టేందుకు వీలుగా సర్వసన్నద్ధంగా ఉన్నామని అధికారులు చెబుతున్నారు. పాతబస్తీ వరకు మెట్రోకు ప్రభుత్వం అనుమతివ్వగానే పనులు మొదలు పెట్టేలా హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ సన్నద్ధంగానే ఉంది. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా మధ్య గ్రౌండ్ ఫెనెట్రేటింగ్ రాడర్ (జీపీఆర్) సర్వే ద్వారా రోడ్డు తవ్వకుండానే భూగర్భంలో రాళ్లు, పైపులు, కేబుల్స్ ఎక్కడ ఉన్నాయి. ఏ మేరకు ఉన్నాయనేదానిపై అంచనాకొచ్చారు. అలైన్‌మెంట్ మార్గంలో పెద్ద ఎత్తున మంచినీటి, వరదనీటి పైపులు, విద్యుత్ ఇతర కేబుళ్ల ఉన్నట్లు గుర్తించారు. మెట్రో స్తంభాలు వేసేందుకు ఇదే పెద్ద సవాల్‌గా ఉంది. సేకరించే ఆస్తుల్లో ప్రార్థనా స్థలాలున్నాయి. ఈ రెండుపనులు పూర్తిచేస్తేనే మెట్రగోకు అడుగు ముందుకు పడుతుంది.

ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా మధ్య మిగిలిన మెట్రో పనులు పూర్తి చేయాలంటే సుమారు రూ.2వేల కోట్ల నిధులు అవసరం అవుతుందని అంచనా. ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించినా ఇంతవరకు ఆ నిధులు మంజూరు చేయలేదు. ప్రభుత్వం ఎప్పుడు పచ్చజెండా ఊపుతుందనేది చూడాల్సి వుంది. ఈ పనులను ఎల్అండ్‌టి మెట్రో పూర్తిచేయాలి. అలైన్‌మెంట్ వివాదంపై గతంలో సర్కారు త్వరగా నిర్ణయం తీసుకోకపోవడంతో 5.5కి.మీ వదిలేసి 69కి.మీ పనులను పూర్తి చేశారు. ప్రభుత్వం నిధులిస్తే చేయగలమని సంస్థ అంటోంది. చిన్న మార్గమే అయినా వెయ్యికిపైగా ఆస్తులు సేకరించాల్సి ఉంది. ఇందులో మతపరమైన కట్టడాలు ఎక్కువగా ఉన్నాయి. మార్కింగ్ చేసినంత వరకు వీటిని తొలగించడం పెద్ద సవాలే. ప్రభుత్వ చొరవతోనే ఆది సాధ్యం. ఇక్కడి భవనాలు చాలా వరకు కూలిపోయే దశలో ఉన్నాయి. ఆస్తుల సేకరణ చేపడితే ఆయా యజమానులు ఇచ్చేందుకు సిద్ధం ఉన్నారని మెట్రో వర్గాలు పేర్కొంటున్నాయి.

మెట్రో అలైన్‌మెంట్ దారుల్‌షిపా నుంచి శాలిబండ మీదుగా ఫలక్‌నుమా వరకు వెళ్తుంది. రహదారి తక్కువ విస్తీర్ణంలో ఉంటుంది. భూగర్భంలో పైపులైనులు, కేబుళ్లు, పురాతన వరద కాలువలు ఉన్నాయి. వీటిని తొలగిస్తే కొత్త సమస్యలు ఎదురయ్యే ప్రమాదముంది. నష్టం జరగకుండా పనులు చేయాలంటే స్తంభాల అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాల్సి ఉంది. ఇదీ పెద్ద సవాల్.స్తంభం స్థానాలు మార్చడమా?అక్కడ ఉన్న యుటిలిటీస్‌ను తరలించడమా అనే చర్చ జరుగుతోంది. అన్ని ప్రత్యామ్నాయాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

# మంత్రి, కమిషనర్ చెప్పినా.. వీళ్లు వినరా..?

**అసిస్టెంట్ సిటీ ప్లానర్ల కనుసన్నల్లో అక్రమ నిర్మాణాలు**

**కోట్ల ప్రభుత్వ ఆదాయాన్ని మింగేస్తున్న ఓ ఇద్దరు**



బాలానగర్ జోన్ ప్రతినిధి, నవంబరు 13 ప్రభాతవార్త: భవన నిర్మాణ నిబంధనలను మరింత ఖచ్చితంగా అమలు చేయాలని ఓ వైపు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాలు జారీ చేస్తుండగా మరో వైపు 25,26, 27 సర్కిళ్ళలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు(ఏసీపీలు) అందుకు విరుద్ధంగా వ్యవహ రిస్తూ అక్రమ నిర్మాణాలకు తమ వంతు సహకారం అందిస్తుం డడంతో రూ.కోట్ల గ్రేటర్ ఆదాయానికి గండి పడుతోంది. మరో వైపు జిహెచ్ఎంసి కమిషనర్ లోకేష్‌కుమార్ కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ నిర్మాణాలను అనుమతించొద్దని, గ్రేటర్ ఆదాయ పెంపుకు చర్యలు తీసుకోవాలని చెబుతుండగా కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు అదుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ తమ స్వార్ధ ప్రయోజనాలకే పరి మితమై రూ.కోట్ల మేర అక్రమార్జనకు పాల్పడుతున్నారు. భవన నిర్మాణాలపై నిత్య పర్యవేక్షణ చేయాల్సిన సంబం ధిత అధికారులు కొందరు మామూళ్ళ మత్తులో మునిగితేలుతున్నారు. అక్రమ కట్టడాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన న్యాక్‌బృందం అసలు పనిచేస్తోందా అనే అనుమానం కలుగక మానదు. అడ్డు అదుపు లేకుండా కొనసాగు తున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో డిప్యూటీ కమిషర్లతో పాటు ఏసీపీలు ఘోరంగా విఫలమవుతున్నారు. బహుళ అంతస్తుల భవనాలలో ప్లాట్లను కొనుగోలు చేసేందుకు ఉద్యోగులు, వ్యాపార వేత్తలు, రిటైర్డ్ ఉద్యోగులు, మధ్యతరగతి వర్గాల వారు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో బహుళ అంతస్తుల భవనాలు అనేక ప్రాంతాల్లో పుట్టగొడు గుల్లా పుట్టుకొస్తున్నాయి. నగరానికి ధీటుగా ఇక్కడి స్థలాలకు డిమాండ్ పెరుగడంతో బహుళంతస్తుల భవనాలు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. ఇళ్ళ నిర్మాణంలో నిబంధనల్ని పాటించడంలేదని సామాన్య మధ్య తరగతి ప్రజల్ని ముప్పుతిప్పలు పెట్టే అధికారులు, నిబంధనలు పాటించని అనేక మంది బిల్డర్ల బహుళంతస్తుల భవనాల్ని అనుమ తులు లేకుండా నిర్మిస్తున్నా పట్టించుకున్న పాపాన పోవడంలేదు. గాజుల రామారం, కుత్బుల్లాపూర్, అల్వాల్ సర్కిళ్ళ పరిధి లోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు పెద్దఎత్తున వెలుస్తున్నాయి. అప్పుడప్పుడు ఉన్నతాధికారుల దృష్టిని మరల్చడానికి ఏదో మొక్కుబడిగా కొన్ని అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా మొక్కుబడిగా నోటీసులు జారీచేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. పైగా న్యాయస్థానాలకు ఆశ్రయించి ఏ విధమైన చర్యలు చేపట్టకుండా స్టే తెచ్చుకుంటే బావుంటుందనే ఉచిత సలహాలను సైతం నోటీసులు ఇచ్చిన భవన యజమానులకు కొందరు అధికారులు సలహాలు ఇస్తున్నారన్న ప్రచారం కూడా బాహాటంగానే వినిపిస్తోంది. రెసిడెన్సియల్ పేరిట అనుమతులు తీసుకుంటున్న అనేక మంది బిల్డర్లు, వాణిజ్య అవసరాల నిమిత్తం మడిగెలు, దుకాణాల్ని నిర్మిస్తున్నారు. అనుమతుల కోసం ముం దుగా ప్లాన్‌లో అన్నీ సక్రమంగానే ఉన్నట్లు పేర్కొని భవన నిర్మాణ అనుమతులు పొంది ఆ తర్వాత అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తు న్నారు. అక్రమంగా నిర్మిస్తున్న కమర్షియల్ భవనాల్ని సంబంధిత అధికారులు అడ్డుకోకపోవడంతో ఒకరిని చూసి మరొకరు పోటీపడి వాణిజ్య అవసరాలకు నిర్మించి కోట్లాదిరూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు పొందిన దానికి విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతుండడంతో కోట్లాది రూపాయల జిహెచ్ఎంసి ఆదాయానికి గండిపడుతుంది. నిబంధనలు పాటించని బిల్డర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతున్న అధికారులు ఆచరణలో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నారు. అపార్ట్ మెంట్లలోని ప్లాట్లను కొన్న తర్వాత అందులో సదుపా యాలు లేక కొనుగోలుదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ కోసం స్థలం లేకపోవడంతో వాహనాలను బయటనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితినెలకొంది. అక్రమ అపార్ట్‌మెం ట్లు పుట్టుకొచ్చి అధికారులు, బిల్డర్ల మాయాజాలం మూలంగా అమాయకులు, లక్షలాది రూపాయలకు ప్లాట్లను కొని నిలువునా మోసపోతున్నారు. ఉన్నతాధికారులు కూడా సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వల్లనే అపార్ట్‌మెంట్లలో ప్లాట్లను కొని కొనుగోలు దారులు మోసపోయే పరిస్థితి ఏర్పడుతుంది. అనేక ప్రాంతాల్లో అడ్డదిడ్డంగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు సర్కిల్ ఉన్నతాధి కారులు టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతే కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు. సర్వధికారాలు ఈ అధికారులకు ఉన్నప్పటికీ జోనల్, సర్కిల్ అధికారులతోపాటు టౌన్‌ప్లానింగ్ విభాగం ఏసీపీలు ఇటీవలి కాలంలో పెద్దఎత్తున వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏదో మొక్కుబడిగా అప్పుడప్పుడు కొన్ని అక్రమ నిర్మాణాలను పాక్షికంగా తొలగించి రంధ్రాలు చేసి సెంట్రింగ్ చెక్కలను తొలగించడం వంటి జిమ్మిక్కులకు పాల్పడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. పరిసర ప్రాంతాల్లో అక్రమ అపార్ట్‌మెంట్లు కొందరు అధికారులను కుబేరులుగా మారుస్తుంది

**వసూళ్లలో ఓ ఇద్దరు యమ బిజీ..**

**రెచ్చిపోతున్న అవినీతి అనకొండలు..**

అక్రమార్జనలో కొత్త రికార్డులు సృష్టిస్తోన్న 25, 26 సర్కిళ్ళ టౌన్‌ప్లానింగ్ విభాగంపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ), విజిలెన్స్ విభాగాల నిఘా అంతంత మాత్రంగా ఉండడంతో అవినీతి మాత్రం తగ్గకపోగా రోజు రోజుకు తారా స్థాయికి చేరుకుంటుంది. కుత్బుల్లాపూర్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) కార్యాలయంలో కీలక బాధ్యతల్ని నిర్వహించడంతోపాటు శివార్లలోని మరో మున్సి పాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఇంచార్జీ బాధ్యతలు నిర్వహిస్తూ జోడు పదవులు నిర్వహిస్తోన్న అధికారి అక్రమ అపార్ట్‌మెంట్లు చేపడుతున్న బిల్డర్లు, నిర్మాణదారుల వద్ద రూ.కోట్ల మేర వసూళ్ళు చేస్తున్నట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నప్పటికీ సదరు అధికారి అసలు పట్టించుకోవడంలేదు. నివాస యోగ్య భవనాల కోసం అనుమతి పొంది కమర్షియల్ భవనాల్ని నిర్మిస్తున్నా సర్కిల్ 26 సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ) కార్యాలయంలో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న మరో అధికారి పట్టించుకోకుండా రూ. కోట్ల ముడుపుల్ని వసూలు చేయిస్తూ జేబులు నింపుకోవడానికి మాత్ర మే పరిమితయ్యాడనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు అక్ర మ వసూళ్ళలో తలమునకలై ప్రభుత్వ డ్యూటీకి తూట్లు పొడుస్తూ రూ.కోట్ల మేర అక్రమార్జనకు పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నారు. అక్రమ సంపాదనతో వీళ్ళకు శివార్లతోపాటు వేరే జిల్లాల్లో భారీగా అక్రమాస్తులు ఉన్నట్లు గుస గసలు వినిపిస్తున్నాయి. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దృష్టిసారిస్తే వీరి అవినీతి గుట్టు బయటపడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

## తెలంగాణ వచ్చిన తరువాతే ఆలయాల అభివృద్ధి

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇతర నేతలు

కంటోన్మెంట్, నవంబర్ 13 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాతనే దేవాలయాలు ఎంతో అభి వృద్ధి చేయడం, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మోండామార్కెట్‌లోని ఎంతో చారిత్ర కలిగిన శ్రీ మైసాసుర అంజనేయస్వామి ఆలయాన్ని పునర్ని ర్మాణం అనంతరం ఆదివారం ప్రారంభో త్సవ పూజలు జరిపారు. ఈ కార్యాక్ర మంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. మంత్రిని ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోండా మార్కెట్‌లోని ఆంజనేయ స్వామి ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని, అంతేకాకుండా మహంకాళి అమ్మవారి ఆలయం, బల్కంపేట్ ఎల్లమ్మ దేవాలయం, గణేష్‌టెంపుల్‌లు సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోనే ఉండడం మన అదృష్టం అన్నారు. ఈ ఆలయాలను ప్రభుత్వం, దాతల సహకారంతో ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌ను కూడా రూ. 20కోట్లు వెచ్చించి అభివృద్ధికి ఏర్పాట్లు చేస్తూన్నట్లు తెలిపారు. ఈ కార్యాక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం టీఆర్ఎస్ ఇంచార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, స్కైలాబ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూపా, ఆలయ కమిటీ సభ్యులు మధు, నేతలు ఆకుల హరికృష్ణా, నాగులు, జయరాజ్, రాములు తదితరులు పాల్గొన్నారు.




# అవినీతిని ప్రభుత్వం అంతమొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అమానుల్లాఖాన్

సైఫాబాద్, నవంబరు 13 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం అవిర్భవించిన తరువాత ప్రభుత్వ కార్యాలయాల్లో రోజు రోజుకు అవినీతి అక్రమాలు పెరిగిపోయాయని తెలంగాణ ఆటో డ్రైవర్స్ జెఎసి కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయాల ఎదుట 'మేము లంచాలు తీసుకోబోము' అని బోర్డులు పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లంచగొండి ప్రభుత్వ ఉద్యోగులను ప్రభుత్వం 'జేబు దొంగలుగా' ప్రకటించాలని కోరారు. ముఖ్యంగా ఆర్టీఎ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, బల్దియా కార్యాలయాల్లో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. అవినీతికి పాల్పడుతున్న వెస్ట్ జోన్ ఆర్టిఓ సిపి వెంకటేశ్వరరావును వెంటనే సస్పెండ్ చేయాలని ఈ దిశగా అవినీతిని అంతమొందించడానికి ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో వెంకటేశ్వరరావు అవినీతి, వేదింపులపైన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే అవినీతిని అంతమొందించడానికి తగు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో లక్ష్మీనర్సయ్య, జమా, అజీంఉద్దీన్, మహ్మద్ లతీఫ్ పాల్గొన్నారు.

# సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగుల కుటుంబ సభ్యుల సందడి



ఏడిపి సంస్థలో సందడి చేస్తున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులు

గచ్చిబౌలి, నవంబరు 13 ప్రభాతవార్త : రోజు తమ తల్లిదండ్రులు పనిచేసే కార్యాలయంలో ఉద్యోగుల పిల్లలు, వారి కుటుంబ సభ్యులు సందడిగా గడిపారు. తమ తల్లి లేదా తండ్రి పనిచేసే కార్యాలయాన్ని పరిశీలించడం, తోటి ఉద్యోగుల కుటుంబ సభ్యులతో గడిపి మధురానుభూతిని పొందారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులు సైతం తమ వారు పనిచేసే ప్రదేశాన్ని గమనించడంతో పాటు వారితో పనిచేసే ఉద్యోగులతో సరదాగా గడిపారు. తమ తల్లిదండ్రుల పని ప్రాంగణాన్ని చిన్నారులు అర్థం చేసుకునేందుకు ఏడిపి సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతి సంవత్సరం బ్రింగ్ యువర్ కిడ్స్ టు వర్క్ పేరిట వార్షిక కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. కోవిడ్ కారణంగా మూడేళ్ల తరువాత తిరిగి ఈ సంవత్సరం ఏడిపి నూతన క్యాంపస్ నానక్‌రాంగూడలో ఉత్సాహంగా సాగింది. చిన్నారులు తమ తల్లిదండ్రులు పనిచేసే కార్యాలయంలో ఆడి,పాడి ఉత్సాహంగా గడిపారు. తమ తల్లిదండ్రులతో కలిసి పనిచేసే తోటి ఉద్యోగులతో సరదాగా గడిపారు. ఒక ఉద్యోగి కుటుంబ సభ్యులు మరో ఉద్యోగి కుటుంబంతో స్నేహం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏడిపి డివిజన్ వైస్‌ప్రసిడెంట్, హెడ్ హెచ్ఆర్ డాక్టర్ విపుల్‌సింగ్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో కుటుంబం పోషించే పాత్ర కీలకమైనదని, ఉద్యోగి పనిచేసే కార్యాలయాన్ని కుటుంబ సభ్యులు, పిల్లలు చూడాలనే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం ఏడిపి ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పిల్లలు ఏడిపి కార్యాలయంలో ఆట,పాటలతో సందడి చేశారు.

# నేడు పద్మవిభూషన్ సికె నాయుడు సంస్మరణ సభ

హైదరాబాద్, నవంబర్ 13 ప్రభాతవార్త : భారత టెస్ట్ క్రికెట్ జట్టు తొలి కెప్టెన్, పద్మవిభూషన్ సికె నాయకుడు 55వ వర్ధంతి సందర్భంగా సికింద్రాబాద్‌లోని సప్తగిరి హోటల్‌లో సోమవారం సాయంత్రం సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు సికె నాయుడు స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ లక్కాకుల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత జాతి ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి దివంగత సికె నాయుడు అభిమానులు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ సంస్మరణ సభకు ముఖ్య అతిథులుగా మాజీ కెప్టెన్ శ్రీమతి కొండా మంజులాకిషోర్, ఎపి అధికార భాష సంఘం అధ్యక్షుడు పివి విజయ్‌బాబు, శ్రీకృష్ణదేవరాయ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎంహెచ్ రావు, హైకోర్టు సీనియర్ న్యాయవాది పి.గంగయ్యనాయుడు, న్యూఢిల్లీ రైల్వే ఉన్నతాధికారి మెండు చక్రపాణి, సీనియర్ జర్నలిస్ట్ రామ్మోహన్‌నాయుడు, హైదరాబాద్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఫార్మర్ అధ్యక్షుడు కాసారం రమేష్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ న్యూస్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ప్రెస్) రాష్ట్ర సంఘ అధ్యక్షుడు బడే ప్రభాకర్, మరికొందరు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. సికె నాయుడు అభిమానులు, బంధువులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# దివ్యాంగులు, బధిరులకు కృత్రిక పరికరాలను పంపిణీ చేయాలి

### డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్





పాల్గొన్న డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్(డిఎస్డీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లభనేని ప్రసాద్, భారతి తదితరులు

చిక్కడపల్లి, నవంబర్ 13 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో దివ్యాంగులు, బధిరులకు కృత్రిక పరికరాలను వెంటనే పంపిణీ చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్(డిఎస్డీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లభనేని ప్రసాద్, వి.భారతి, ఉపాధ్యక్షుడు వె.వెంకటేశ్‌గౌడ్ కోరారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బధిరుల వివాహాల పరిచయ వేదిక కార్యక్రమం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మాట్రిమోనియల్ సొసైటీ ఫర్ ది డీఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్వాహకులు డి.కిషోర్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కోకన్వీనర్ వి.భారతీ, వెంకటేశ్‌గౌడ్ హాజరై ప్రసంగించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి బధిరులు, కులమతాలు ఎలాంటి నిమిత్తంలేకుండా తమకు భాగస్వామిని ఎంచుకోవడంతో భాగంగా ఇటువంటి వేదికలను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గత 8 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం అరకొరగా పంపిణీ చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి 'ఆన్‌లైన్' ద్వారా ట్రైసైక్లి వాహనాలు, 5జీ మొబైల్, ల్యాప్‌టాప్, బ్యాటరీ వాహనాలతో పాటు వినికిడి యంత్రాలు, అంధులకు రోలోటర్స్, చేతికర్రలు, మానసిక దివ్యాంగులకు ఎంఆర్.కిట్స్, చేతికర్రలు సహా తదితర కృత్రిమ పరికరాలు పంపిణీ చేయుటకు వచ్చే డిసెంబర్ 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పంపిణీ చేయాలని కోరారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి

బేగంపేట నవంబరు 13,ప్రభాతవార్త : మహంకాళీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జైన్ ఆలయం ముందు సంతోష్‌ధాబా వద్ద గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మహంకాళీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ సంఘటనపై విధులలో ఉన్న కానిస్టేబుల్ ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.12వ తేదీ ఉదయం గం 8 సమయంలో ప్రవీణ్ కుమార్ కానిస్టేబుల్ హోంగార్డు నర్సింహరాజులు పెట్రోకారు 2లో విధులు నిర్వర్తిస్తున్నారు.సాయంత్రం గం 6ల సమయంలో డయల్ 100 నుంచి వారికి సమాచారం అందింది. జైన్ టెంపుల్ ఎదురుగా,సంతోష్ ధాబా వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి ఉన్నాడన్న సమాచారం అందింది.వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించిగా అతను చనిపోయినట్లు గుర్తించారు.వెంటనే మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.మృతుడు సుమారు 55సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని,వంటిపైన బ్లూ కలర్ మరియూ నలుపు రంగు చారల చొక్కా ఉంది.హిందువు అని,మృతుని గురించి ఆ ప్రాంతంలో విచారించగా ఆ ప్రాంతంలో భిక్షాటన చేస్తుంటాడని తెల్సిందన్నారు.మృతుని వివరాలు తెల్సిన వారు మహంకాళీ పోలీస్‌స్టేషన్ లో సంప్రదించాలని,కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సైపి.రాంబాబు తెలిపారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : మంత్రి మల్లారెడ్డి



బాలంరాయి గీతాంజలి
రజతోత్సవ వేడుకల్లో మంత్రి మల్లారెడ్డి

కంటోన్మెంట్, నవంబర్ 13 ప్రభాతవార్త: విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెంది సమాజాభివృద్ధి కోసం పాటుపడాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి సి.హెచ్. మల్లారెడ్డి, తెలిపారు. సికింద్రాబాద్ బాలంరాయి గీతాంజలి దేవ్ శాల హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గ్రేటర్‌లో గీతాంజలి హైస్కూల్‌కు, అందులో చదువుతున్న విద్యార్థులకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి దేశాభివృద్ధికి పాటుపడడంతో పాటు ఐఏఎస్, ఐపిఎస్ వంటి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. 23 యేండ్ల వయసులో తాను పాల వ్యాపారిగా పనిచేశానని ప్రస్తుతం తాను 13 ఇంజనిరింగ్ కళాశాలలు 60 వేల మంది విద్యార్థులు చదువుకునే విద్యా సంస్థలను నెలకొల్పాడంతో పాటు ఎంపీగా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఎదిగానన్నారు. మీరు కూడా అదే బాటలో నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ ఉమాకరన్, వ్యవస్థాపకురాలు గీతాకరన్, కార్య నిర్వాహన అధికారి జయకరన్, ప్రిన్సిపాల్ మాధవి చంద్ర, గీతాం విశ్వ విద్యాలయ అధ్యక్షులు భరత్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురిని అలరించే విధంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# కాళోజీ సేవలు మరువలేనివి

సైఫాబాద్, నవంబరు 13 ప్రభాతవార్త: తెలంగాణ అధునిక సాహిత్యవేత్త కాళోజీ నారాయణరావు తెలంగాణ సాధనలో విశేషమైన సేవలు అందిచ్చారని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజ్వేర్‌రావు కొనియాడారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన కాళోజీ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత ఆయన చిత్రపటానికి రాజేశ్వర్‌రావు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాళోజీ అశయాల సాధన కోసం పాలకులు పాటుపడాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ ప్రజలకు చేసింది ఏమిలేదని, రాష్ట్ర ప్రభుత్వంపై విషం కక్కారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూనే మరొక వైపు రామగుండం ఎరువుల ఫ్యాక్టిరీని ప్రైవేటుపరం చేయబోమని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజు, అమోజ్, శాంతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

సికింద్రాబాద్, నవంబర్ 13 ప్రభాతవార్త : సోమవారం ఉదయం 11 గంటలకు సీతాఫల్‌మండి డివిజన్‌లో లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ పంపిణి చేస్తారని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామలహేమ తెలిపారు. లబ్దిదారుల ఇంటింటికి వెళ్లి చెక్కులను అందజేస్తారని వివరించారు. టీఆర్ఎస్ నాయకులు, కార్యాకర్తలు కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని కార్పొరేటర్ కోరారు.

## ప్రగతినగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనుల
ప్రారంభోత్సవంలో స్థానికులతో కార్పొరేటర్ మార్తా వాణి

నిజాంపేట్,నవంబర్13 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ లేక్‌వ్యూ కాలనీలో సుమారు రూ.8లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆదివారం కార్పొరేటర్ మార్తా వాణిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సీసీ రోడ్డు పనులలో నాణ్యతను ఖచ్చితంగా పాటించాలని, పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ రాజ్‌కుమార్, వెంకట్, రామచంద్రరావు, గోవిందరాజులు, కళ్యాణ్,నాయుడు, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## గొప్ప సంఘసేవకులు పాశం రామ్మూర్తియాదవ్

### సంస్మరణసభలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, అంజన్‌కుమార్,



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎంపి అంజన్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి, నవంబరు 13 ప్రభాతవార్త: సేవా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు అందరికి అందుబాటులో ఉంటూ అందరి నుంచి ప్రశంసలు అందుకున్న గొప్ప వ్యక్తి ప్రముఖ సంఘసేవకులు పాశం రామ్మూర్తి యాదవ్ అని మాజీ లోకసభ సభ్యుడు, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బాకారంలో ఆదివారం జరిగిన పాశం రామ్మూర్తి యాదవ్ సంస్మరణ సభ నగర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, రామ్మూర్తి యాదవ్ కుమారుడు పాశంఅనీల్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ పరిధిలో వైద్యఆరోగ్యశాఖ లే సెక్రటరీగా విధులు నిర్వహించి ఎంతో పేరును సంపాదించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, నాగర్‌కర్నూలు మాజీ ఎమ్మెల్యే మోహన్‌గౌడ్, టిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, టిఆర్ఎస్ రాష్ట్రనాయకుడు ఎం.ఎన్.శ్రీనివాస్‌రావు, నగర కాంగ్రెస్ నేతలు మేడి సురేశ్, సురేశ్‌యాదవ్, పెండెం శ్రీనివాస్‌యాదవ్, ఆర్.లక్ష్మణ్ యాదవ్, సుదేశ్, రామ్మూర్తి యాదవ్ కుటుంబ సభ్యులు పాశం సునీల్‌కుమార్ యాదవ్, పాశం వెంకటేశ్ యాదవ్, పాశం అనూరాధ, పాశం మనోజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### అశ్రిత బాలికల ఆశ్రమంలో

## బాలికల దినోత్సవం

చార్మినార్, నవంబరు 13 ప్రభాతవార్త : పాతబస్తీ దూద్‌బౌలిలోని అశ్రిత్ హోంలో ఆదివారం ఎన్ఎపి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం కార్యక్రమం జరిగింది.బాలల దినోత్సవం సందర్భం గా ఫౌండేషన్ తరుపున బాలికలకు పలు రకాల ఆహర పదార్థాలు,నోట్ పుస్తకాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎన్ఎపి ఫౌండేషన్ అధ్యక్షులు కందుల అనిల్ కుమార్ మాట్లాడుతూ బాలికలు అన్ని రంగా లలో చురుకుగా పాల్గొని దేశాభివృద్ధికి వెలుగు నివ్వాలని తెలిపారు.అశ్రిత్ ప్రోగ్రాం మేనేజర్ పర్వతాలు మాట్లాతూ ఎన్ఎపి ఫౌండేషన్ గత పది సంవత్సరాలు నుంచి అశ్రిత్ హోంకు అన్ని విధాల చేయూత నిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తు న్నాని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎపి ఫౌండేషన్ ప్రతినిధులు అరుణ జ్యోతి,నేహ మేడమ్,ప్రోగ్రాం మేనేజర్ పర్వతాలు అశ్రిత టీమ్ అనిత,నాగమణి, సుజాత పాల్గొన్నారు.

## పాటల ఆలాపనతో రికార్డులో చోటు

చిక్కడపల్లి, నవంబరు 13 ప్రభాతవార్త: అక్కిరాజు రిషి మ్యూజికల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వాహక సంస్థ అధినేత్రి, ప్రముఖ గాయనీ యోగిత ఆధ్వర్యంలో 'స్వరసంగమం' పేరుతో సినీసంగీత విభావరి కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వాహక సంస్థ అధినేత అక్కిరాజు ప్రభంజన్ ఆధ్వర్యంలో జరిగింది. వర్ధమాన గాయనీ యోగిత అక్కిరాజు పాటల ఆలాపనలో విశిష్ట ప్రయోగంతో ఏకధాటిగా 12 గంటల పాటు 130 పాటలను 30 మహిళా గాయకులు, 36 మంది పురుష గాయకుల సహకారంతో ప్రముఖ గాయనీ అక్కిరాజు యోగిత నిర్వహించినందుకుగాను 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డు'ల్లో చోటు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వరకిన్నెర చింతలపూడి త్రినాథరావు, గోర్తి చంద్రశేఖర్, కెఎల్.రావు, మణిద్వీప అధినేత రాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## వెంకటేష్‌ను అభినందించిన రేవంత్‌రెడ్డి

చార్మినార్,నవంబరు 13 ప్రభాతవార్త : చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కె.వెంకటేష్ భారత్ జోడో యాత్రలో పాల్గొనటంతో పాటు మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసి నందుకు టిపిసిసి అధ్యక్షులు ప్రత్యేకంగా వెంకటేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏడు పదుల వయసులో వరల్డ్ రికార్డు సాధించాడు



కృష్ణారెడ్డికి రికార్డులు ప్రదానం చేస్తున్న ప్రముఖులు

హైదరాబాద్, నవంబరు 13 ప్రభాతవార్త: ఏడు దశాబ్దాల వయసులో డా.ఎద్దుల కృష్ణారెడ్డి ముచ్చటగా మూడోసారి వరల్డ్ రికార్డ్ సాధించారు. జివిఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డా.జి.ఎస్. గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆధివారం నిర్వహించిన కార్యక్రమంలో సైదాబాద్‌లోని వివేక్ హాస్పటల్ నుంచి ట్యాంక్‌బండ్‌పైన గల స్వామి వివేకానంద విగ్రహం 9 కిలోమీటర్ల దూరాన్ని 83 నిమిషాల్లో నడిచి రికార్డు సృష్టించారు. ఈ కార్యక్రమాన్ని జైళ్ళశాఖ శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, చంచల్‌గూడ జైలర్ రత్నం జెండా ఊపి ప్రారంభించారు. ఇప్పటికే ఆయన గత ఏడాది భారత దేశ స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా 75 టైల్స్ తన కిక్కుతో మూడు నిమిషాల 40 సెకండ్లలో పగలగొట్టి వరల్డ్ రికార్డు సాధించారు. ఇలా ఎన్నో రికార్డులను ఆయన సాధించారు. ఈ సందర్భంగా కాచిగూడలోని జివిఆర్ కరాటే అకాడమీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ రికార్డ్స్ ఆయా సంస్థల ప్రతినిధులు కృష్ణారెడ్డికి అందజేశారు. ముఖ్యఅతిధులుగా సిటిసి గోషామహాల్ ప్రిన్సిపల్ బురహాన్ ఆలీ, హైకోర్టు సీనియర్ న్యావాది ఎస్.అశోక్ కుమార్, నేతాజీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్‌కోట్ల నిరంజన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ గవర్నర్ ప్రభాకర్, మాణిక్‌ప్రభు తదితరులు పాల్గొని కృష్ణారెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ రికార్డ్స్‌ను సినీయర్ సిటిజన్స్‌కు అంకితం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయమం తప్పనిసరిగా చేయాలని, మానసిక వత్తిడిని కూడా తగ్గించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ప్రతినిధులు కరీం, సుభాష్, సర్వర్, అమృత, జానికి, షైని, యోగిని, నందిని పాల్గొన్నారు.

# సగరుల సమస్యల పరిష్కారం కోసం త్వరలో నగరంలో భారీ బహిరంగ సభ

### రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్‌సగర

గచ్చిబౌలి, నవంబరు 13 ప్రభాతవార్త : జాతి ప్రయోజనాల కోసం సగరులు సంఘటితంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, సగరుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే హైదరాబాద్ నగరంలో త్వరలో లక్షలాది మందితో సగర బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం గచ్చిబౌలి అంజయ్యనగర్‌లోని సగర సంఘం కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రవి సగర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు ప్రాంతీయ సంఘాల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర మాట్లాడుతూ జాతి ప్రయోజనాల కోసం సంఘటితం కావడంలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సగర కుల జనగణన త్వరితగతిన పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముత్యాల హరికిషన్ సగర, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి మర్క సురేష్ సగర, గ్రేటర్ సగర సంఘం గౌరవ అధ్యక్షుడు అస్కాని వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకట్రాములు, కోశాధికారి దిండి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులకు వర్క్‌షాపు

నిజాంపేట్, నవంబర్ 13 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎస్ఎల్‌జి ఆసుపత్రి ఐఎస్‌సీసీఎం సౌజన్యంతో రోగుల పునరుజ్జీవనంపై వైద్యులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాపును సాఫ్ దర్ జంఘ్ న్యూ ఢిల్లీ ఆసుపత్రి మాజీ మెడికల్ సూపరింటెండెంట్ డా.వినోద్ దోగ్రా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఎస్ఎల్‌జీ ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్, క్రిటికల్ కేర్ మెడిసిన్ హెచ్ఓడీ డా.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన సుమారు 100మంది పైగా వైద్యులు తమ అనుభవాలను పంచుకునేందుకు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారని తెలిపారు. మానవ వాలంటీర్లు, డమ్మీలపై వైద్య ప్రక్రియలు నిర్వహించడం ద్వారా ప్రత్యక్ష అనుభం పొందే విధంగా ఈ వర్క్‌షాప్ తీర్చిదిద్దబడిందన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా పునరుజ్జీవన ప్రక్రియలోని కొత్త అంశాలను సమగ్రంగా నేర్చుకోగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌జి ఆసుపత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దండు శివరామరాజు,ఎస్ఎల్‌జీ ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రాంగోపాల్‌పేట నుంచి కీసర గుట్ట

## వన భోజనాలకు తరలి వెళ్లిన బిజెపి శ్రేణులు



బేగంపేట నవంబరు 13,ప్రభాతవార్త : కార్తీక మాసం సందర్భంగా కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి నిర్వహిస్తున్న వనభోజనాల కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాంగోపాల్‌పేట డివిజన్ కార్పొరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో భాజపా శ్రేణులు కీసర గుట్టకు బయలుదేరి వెళ్లారు.కార్తీక మాసంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వనభోజనాల కార్యక్రమానికి పెద్దసంఖ్యలో డివిజన్ నుంచి భాజపా నాయకులు, కార్యకర్తలతో తరలి వెళుతున్నామని కార్పొరేటర్ చీరె సుచిత్రా అన్నారు.

## 'ప్రీ స్పోర్ట్స్ మీట్'లో పాల్గొన్న ఎమ్మెల్యే





స్పోర్ట్స్ మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కెపి వివేకానంద్

పేట్‌బషీరాబాద్, నవంబర్13 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధి టీఎన్ఆర్ గార్డెన్‌లో 'ఫిట్టెస్ట్ ఆఫ్ తెలంగాణ' పేరుతో స్నాచ్ ఫిట్‌నెస్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన 'ప్రీ స్పోర్ట్స్ మీట్' ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పిస్తూ చేపట్టిన 'ప్రీ స్పోర్ట్స్ మీట్‌'లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన స్నాచ్ ఫిట్‌నెస్ వారిని అభినందించారు. అనంతరం యువతతో కలిసి వ్యాయామం చేయడంతో పాటు పోటీల్లో గెలుపొందిన ప్రథమ,ద్వితీయ తృతీయ విజేతలకు రూ.5వేల చొప్పున నగదును బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కోచ్ సతీష్‌గౌడ్, ఆర్గనైజర్ శ్రీకాంత్‌గౌడ్, సాయి శేఖర్‌గౌడ్, వినయ్ గౌడ్, స్థానిక నాయకులు, యువత పాల్గొన్నారు.

### హైదరాబాద్ పబ్లిక్‌స్కూలు బేగంపేట శతాబ్ది ఉత్సవాల

# కర్టన్ రైజర్ కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు

**తోడ్పాడునందిస్తామని హామీ ఇచ్చిన పూర్వ విదార్థులు.. జనవరి 2023నుంచి హెచ్‌పీఎస్ శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం**



ప్రత్యేక విందుకు హాజరైన పూర్వ విద్యార్థులు

బేగంపేట నవంబరు 13, ప్రభాతవార్త : హైదరాబాద్ పబ్లిక్ స్కూలు సొసైటీ, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ జనవరి 2023నుంచి ప్రారంభమయ్యే హెచ్‌పిఎస్ (బేగంపేట) శతాబ్ది ఉత్సవాల కోసం ప్రత్యేక మైన కర్టన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించాయి.దీని తర్వాత హెచ్‌పీఎస్ విజన్, మిషన్ 2050 మరియూ భవిష్యత్ మౌలిక సదుపాయాల ప్రణాళికలపై వివరణాత్మకమైన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా బేగంపేట హెచ్‌పిఎస్ పాఠశాలలో నిర్వహించిన విందుకు 300మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.ఈ సందర్భంగా పాఠశాలను గ్లోబల్ ఎక్స్‌లెన్స్ విద్యా సంస్థగా తీర్చిదిద్దేందుకు తోడ్పాడు నందిస్తామని వారు హామీ ఇచ్చారు.విందుకు హాజరైన ప్రముఖ పూర్వ విద్యార్థులలో మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు,మాజీ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వరరెడ్డి, పద్మశ్రీ డా.పి.రఘురామ్,ఇన్వ్ అసెంట్, హరిబుగ్గనలతో పాటు ప్రముఖ వైద్యులు,వ్యాపారవేత్తలు, న్యాయవాదులు,రాజకీయ నాయకులు,క్రీడాకారులు,కళాకారులు, అనేక ఇతర సభ్యులు ఈ విందుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరు కాలేక పోయిన శంతను నారాయణ్ (సీఈఓ ఆడోబ్),శ్రీసత్య నాదెళ్ల, (సీఈఓ మైక్రోసాఫ్ట్),శ్రీరామ్ పంచు (సీనియర్ అడ్వకేట్,మద్రాస్ హైకోర్టు),హర్షభోగ్లే (ప్రముఖ టివి వ్యాఖ్యాత),శైలేష్ జెజురికర్( సీఓఓ (ప్రాక్టర్ అండ్ గాంబుల్), అక్కినేనినాగార్జున (సినిమా నటుడు),సయ్యద్ అక్బరుద్దీన్(ఐఎఫ్ఎస్ రిటైర్డ్),ప్రభు పింగళి(ఛైర్మన్ ఇక్రిసాట్) వంటి ప్రముఖ పూర్వ విద్యార్థులు క్రియాశీల భాగస్వామ్యానికి నిబద్ధతతో కూడిన తమ తమ వీడియో సందేశాల ద్వారా ఇతర పూర్వ విద్యార్థులు అ ందరూ ముందుకు రావాలని,మరియూ పాఠశాల దార్శనికతను అమలు చేయడంలో సహకరించాలని విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా హైదరాబాద్ పబ్లిక్ స్కూలు ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవ్ దేవ్ సరస్వత్ మాట్లాడుతూ మన పాఠశాల శతాబ్ది సంవత్సరంలోకి ప్రవేశించినపుడు పాఠశాలకు కొత్త విధానం,కొత్త ఆలోచన అవసరమైన వనరుల ద్వారా నూతన ప్రేరేపణ అవసరం అన్నారు.విజన్ 2050లో నిర్దేశించబడిన సాహసోపేతమైన ప్రణాళికలను సమర్థ వంతంగా అందుకోవడానికి అధ్యాపకులు, విద్యా ర్థులు,పూర్వ విద్యార్థులు, నిర్వహకులు,దాతలు,ధర్మకర్తలు సహకారం అవసరం ఉంటుందన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూలు సొసైటీ ప్రశిడెంట్ గుస్తీజె నోరియా మాట్లాడుతూ ఏదైనా సంస్థ యొక్క సంస్కృతి కాలక్రమేణా పెరుగుతుందని, పాఠశాలతో పూర్వ విద్యార్థులు సంరక్షులుగా ఉంటారని అన్నారు.పూర్వ విద్యార్థులు మన పాఠశాలకు,దేశానికి, ప్రపంచానికి అందించిన సహకారం ద్వారా మన పాఠశాల యొక్క విజయాన్ని కొలవవచ్చాన్నారు.హెచ్‌పీఎస్ టార్చ్‌బేరర్లమని చెప్పడానికి తామంతా గర్విస్తున్నామని చెప్పారు. **శతాబ్ది ఉత్సవాల గురించి..** జనవరి 2023లో ప్రారంభమయ్యే శతాబ్ది ఉత్సవాలు, విద్యార్థులు,సిబ్బంది, తల్లి దండ్రులు పూర్వ విద్యార్థుల కార్యకలాపాలు,ఈవెంట్లతో ఏడాది పొడవునా గ్రాండ్



సెలబ్రేషన్స్ నిర్వహించేందుకు ప్రణాళిక రచిస్తున్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూలు సొసైటీ 2050 బేగంపేట,రామంతపూర్, కడప,మరియూ వరంగల్‌లో నాలుగు పాఠశాలల్లో తదుపరి మూడు దశాబ్దాలలో 2050వరకు ముందుకు సాగడానికి ఒక విజన్ మరియూ రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసింది.

## సమస్య తీరేవరకు నిరంతరం పోరాడుతూనే ఉంటాం

### మర్రి రాజశేఖర్‌రెడ్డి

కంటోన్మెంట్, నవంబర్ 13 ప్రభాతవార్త: తెరాస మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి తిరుమల గిరి ప్రజలకు 40 సంవత్సరాలుగా సేవదించిన గాంధీ కమ్యూనిటీ హాల్‌లో ఎస్‌సీబి ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే సాయన్నతో కలిసి ఆదివారం ధర్నా నిర్వహించారు. డంపింగ్ యార్డ్‌ను తొలగించే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జీఎంఆర్, మాజీ మార్కెట్ చైర్మన్ టి.ఎస్. శ్రీనివాస్, మాజీ బోర్డు సభ్యులు శ్యామ్‌కుమార్, నళిని, లోకనాతం, పాండు యాదవ్, నర్సింహ్మా, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలి


ధర్నా జరుపుతున్న మర్రి రాజశేఖర్ రెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్నలు

కంటోన్మెంట్, నవంబర్ 13 ప్రభాతవార్త : తిరుమలగిరిలో 40 సంవత్సరాలుగా ఉపయోగపడ్డ గాంధీ కమ్యూనిటీహాల్, డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంచార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి. సాయన్నతో పాటు ధర్నా జరిపారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సమస్య పరిష్కారం అయ్యేవరకు తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యాక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జెఎంఆర్, మాజీ సభ్యులు ప్యారసాని శ్యామ్‌కుమార్, నళిని, లోకనాథం, పాండుయాదవ్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, నర్సింహా పాల్గొన్నారు.

## క్రీడా జర్నలిస్టు కోట్ల రామకృష్ణ మృతి



ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, సీనియర్ జర్నలిస్టు కోట్ల రామకృష్ణ (52) శనివారం రాత్రి 10.30గంటలకు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తెలంగాణ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కోట్ల రామకృష్ణ సీనియర్ జర్నలిస్టుగా కొనసాగుతున్నారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రామకృష్ణ బోడుప్పల్‌లోని శ్రీకర ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రామకృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, తెల్కపల్లి మండలం, ఆలేరు గ్రామానికి చెందిన నగరానికి వచ్చి బోడుప్పల్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలో ఆదివారం నిర్వహించారు. **మంత్రి, స్పోర్ట్స్ చైర్మన్ సంతాపం..** సీనియర్ జర్నలిస్టు కోట్ల రామకృష్ణ మరణం పట్ల మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వరరెడ్డి, తెలంగాణ జూనియర్ కాలేజ్ పిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా.అలేరు బాలరాజు, ప్రధాన కార్యదర్శి డా.బొమ్మర బోయిన లక్ష్మయ్య తీవ్ర సంతాపం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ క్రీడాకారుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. సుదీర్ఘకాలంగా జర్నలిస్టుగా రాష్ట్ర క్రీడల అభివృద్ధిలో క్రీడాకారుల సంక్షేమం కోసం రామకృష్ణ ఎంతో సేవ చేశారని కొనియాడారు. రామకృష్ణ కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేశారు.

## ఘనంగా కుత్బుల్లాపూర్ గోకుల యాదవసంఘ వనభోజనాలు



కుత్బుల్లాపూర్ గోకుల యాదవసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనభోజనాలలో పాల్గొని ప్రసంగిస్తున్న కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్, అధ్యక్షులు ఎల్.వెంకట్‌రావు, తిరుమలరావు యాదవ్

కుత్బుల్లాపూర్, నవంబరు 13 ప్రభాతవార్త : కలిసికట్టుగా నిరుపేద యాదవులకు సహాయ,సహకారాలను అందించి సంఘ అభ్యున్నతికి ఒకరికి ఒకరుతోడ్పాటును అందించుకోవాలని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ పిలుపునిచ్చారు. ఆదివారం హెచ్ఎంటి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆయన సమీపంలో కుత్బుల్లాపూర్ పరిధిలోని గోకుల యాదవ సంఘ వనభోజనాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్తీక వనభోజనాల సందర్భంగా గోకుల యాదవసంఘం నిర్వహించిన మహోత్సవానకి వందలాది మంది యాదవ సంఘ కుటుంబీకులు పాల్గొని ఆట,పాటలతో సందడిచేశారు. ఉదయం తొమ్మిది గంటలనుండి సాయంత్రం ఆరుగంటల వరకు పిల్లలు, మహిళలు, యువకులకు క్రీడాపోటీలు, ఆట,పాటలతో సభాప్రాంగాణం అ ంతా కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో జంట నగరాల యాదసంఘ ప్రతినిధులు యూసుఫ్‌గుడ యాదవసంఘ నాయకులు చిన్న నవీన్‌కుమార్, మేడ్చెల్ మార్కెట్‌యార్డ్ చైర్మెన్ రవిందర్‌యాదవ్, బిజెపి నాయకులు జె.కె.శేఖర్‌యాదవ్, టిఆర్ఎస్ యువజన విభాగం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్‌యాదవ్, బిసి సంఘ నాయకులు రాజశేఖర్‌యాదవ్, కౌన్సిలర్లు మురళీయాదవ్, దుండిగల్ జక్కుల శ్రీనివాస్‌యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు మల్లేశ్‌యాదవ్, కుత్బుల్లాపూర్ గోకుల యాదవసంఘ అధ్యక్షులు ఎల్.వెంకట్‌రావు యాదవ్, ప్రధానకార్యదర్శి తిరుమలరావు యాదవ్, క్రియాశీలక అధ్యక్షులు కె.శ్రీనివాసరావు యాదవ్, జె.భవన్నారాయణ యాదవ్, ఉపాధ్యక్షులు శివరామకృష్ణయాదవ్ పాల్గొన్నారు.

## వైభవోపేతంగా గోల్కొండ నృత్యోత్సవం : డా. మామిడి హరికృష్ణ


గోల్కొండ నృత్యోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మామిడిహరికృష్ణ, కిరణ్మయి, పద్మకల్యాణి

రవీంద్రభారతి, నవంబరు 13 ప్రభాతవార్త : అఖిల భారత శాస్త్రీయ నృత్యోత్సవాన్ని ప్రముఖ సంస్థ సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ గోల్కొండ నృత్యోత్సవం పేరున ఈ నెల 26, 27 తేదీల్లో చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో వైభవంగా నిర్వహించ తలపెట్టడం హర్షదాయకమని తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ అన్నారు. ఆదివారం రవీంద్రభారతి ప్రాంగణం కళాభవన్ లోని తన కార్యాలయంలో ఈ నృత్యోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఉత్సవ డైరెక్టర్ కిరణ్మయి బోనాల, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు పద్మాకళ్యాణిలతో కలిసి ఆవిష్కరించి మాట్లాడుతూ భారతీయ ఉత్కృష్ట సంస్కృతీ సంప్రదాయాలను కళారూపాల్లో అందించడానికి నృత్యోత్సవాలు ఎంతగానో ఉపకరిస్తాయని, కళలపట్ల మమకారంతో ప్రముఖులతో క్లాసికల్ డాన్స్ ఆన్ వీల్స్ అనే ప్రత్యేకాంశాన్ని ఒకే వేదికపై ఏర్పాటు చేయడం శ్లాఘనీయమని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుండే కాకుండా హాంకాంగ్ తదితర దేశాల నుండి నాట్యకళాకారులు హాజరవుతున్న గోల్కొండ నృత్యోత్సవాన్ని విజయవంతం చేయడానికి తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ పూర్తి సహాయసహకారాలు అందిస్తుందన్న భరోసానిచ్చారు. గోల్కొండ తెలంగాణ రాష్ట్రానికి హెరిటేజ్ సింబల్, నగరానికి ల్యాండ్‌మార్క్ వంటిదని, ఈ పేరున నృత్యోత్సవాలను నిర్వహించడం రాష్ట్రానికి ప్రత్యేకతను తీసుకొస్తుందని నిర్వాహకులు పద్మాకళ్యాణి, కిరణ్మయిలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రముఖ నాట్యాచార్యుడు ప్రొఫెసర్ పసుమర్తి రామలింగేశ్వరశాస్త్రిని ఘనంగా సత్కరించి కళ్యాణ్‌శ్రేష్ఠ అవార్డు, 25వేల నగదు, తామ్రపత్రం అందజేయనున్నట్లు వివరించారు. అలాగే ఈ నృత్యోత్సవంలో పాల్గొనే ప్రతీకళాకారుడికి గోల్కొండ పురస్కారమిచ్చి సత్కరించి రాష్ట్ర సాంస్కృతిక అభ్యున్నతిని విశ్వవ్యాప్తం చేస్తామని పేర్కొన్నారు.

## శెట్టి బలిజలు హక్కుల సాధనకోసం సంఘటితమవ్వాలి : కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్, నవంబరు 13 ప్రభాతవార్త : శెట్టిబలిజలు తమ హక్కుల సాధనకోసం సంఘటితంగా నడుంబిగించాలని కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం చింతల్ శెట్టిబలిజ సంఘ ఆధ్వర్యంలో హెచ్ఎంటి పోచమ్మదేవాలయ ఆవరణలో నిర్వహించిన శెట్టిబలిజ వన భోజన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శెట్టిబలిజలను ఓసి జాబితానుండి బిఇ జాబితాలోకి చేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2016 జిహెచ్ఎంసి ఎన్నికల్లోనూ, 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎంఎల్ఎ వివేక్ శెట్టిబలిజలకు హామీలు ఇచ్చి మోసంచేశారని అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గుత్తుల మీరాకుమార్, శివశంకర్, దుర్గాప్రసాద్, దమ్మేటి శ్రీనివాస్, బొంతు వెంకటేశ్వరరావు, గుబ్బల లక్ష్మినారాయణ, చింతపట్టివెంకటేశ్వరరావు, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు నియమ నిబద్ధతతో విశ్వసనీయ వార్తలనందించాలి

### హర్యానా గవర్నరు బండారు దత్తాత్రేయ

నాంపల్లి, నవంబరు 13 ప్రభాతవార్త : జర్నలిస్టులు ఎల్లవేళలా నియమ నిబద్ధతలతో పనిచేస్తూ విశ్వసనీయమైన వార్తలను ప్రజానీకానికి అందజేయాలని, నకిలీ వార్తలు సమాజంపై ఎంతో చెడుప్రభావాన్ని చూపుతాయని హర్యానా రాష్ట్ర గవర్నరు బండారు దత్తాత్రేయ ఇటీవల టీజెఎ రాష్ట్ర నాలుగవ ద్వివార్షిక ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన జర్నలిస్టు కె.వి.రమణారావును సత్కరిస్తూ అన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలోనూ, జర్నలిస్టులకు రైల్వే రాయితీ పాసుల విషయాన్ని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిం చేందుకు తనవంతు పూర్తి సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పూర్వసభ్యుడు ఉప్పల లక్ష్మణ్, నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌తివారీ, కోఆర్డినేటర్ ఇంద్రాణి, సంఘసేవకుడు బి.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## వసంతనగర్‌లో కార్తీకమాస భోజనాలు


కార్తికమాస వనభోజనంలో పాల్గొన్న సభ్యులు

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 13, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వసంత నగర్ బస్‌స్టాప్ వద్ద కార్తిక మాస వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావును ఆదర్శంగా తీసుకుని ప్రతీ ఒక్కరూ జీవితంలో ఎదగాలని, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు సాగాలన్నారు. ఆయన అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భోజన కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా పరుషులు, మహిళలు, చిన్నపిల్లలు సుమారు 6వేల మంది ఎంతో ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ అభిమాన సంఘం సభ్యులు కార్పొరేటర్ మందా3డి శ్రీనివాసరావు, కిలారు శ్రీనివాస్‌బాబు, సత్తార్, మధు, పిఎస్ఎన్‌రాజు, కుర్ర ప్రభు, రాజేష్, వెంగయ్య, వి.రామకృష్ణ, బి.పిచ్చయ్య, గాలి కిరణ్, కె.సాంబశివరావు, భాను, పద్మారావు, ఎటుకూరి జనార్ధన్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## చెక్కులను పంపిణీ చేసిన డిప్యూటీ స్పీకర్


లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, చిత్రంలో రాజేష్ గౌడ్

మెట్టుగూడ, నవంబర్ 13 ప్రభాతవార్త: మెట్టుగూడ డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీలో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ స్థానిక కార్పోరేటర్ రాసూరి సునితతో కలిసి కళ్యాణ లక్ష్మి, షాదిముభార్, సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను లబ్దిదారులకు ఇంటింటింటి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజేష్ గౌడ్ పెద్దన్న చేతుల మీదుగా పద్మారావుగౌడ్ లబ్దిదారులకు అందజేయించారు. ఈ కార్యక్రమంలో పద్మారావుగౌడ్ తనయులు రామేశ్వర్‌గౌడ్, కిషోర్‌గౌడ్, డా.గంగాధర్, రాజేష్‌గౌడ్, ఏఆర్ కృష్ణ, ప్రకాష్ పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు మరింత చేరువ: కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్, నవంబరు 13 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తానని శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ హామీఇచ్చారు. ఆదివారం డివిజన్ పరిధిలో సుమారు సుమారు రెండుకోట్ల డెబై అయిదు లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన అభివృద్ధిపనులకు ఆయన స్థానిక మాజీ కార్పొరేటర్ కూన పారిజాత గౌరీష్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా దత్తాత్రేయనగర్‌లో రూ.లు. 56.50వ్యయంతో సిమెంట్‌రోడ్ల నిర్మాణ పనులు, రూ.లు. 25.50 లక్షల వ్యయంతో సిమెంట్‌రోడ్ ప్యాచ్‌వర్కులు, బాల్‌రెడ్డినగర్‌లో రూ.లు.11లక్షలవ్యయంతో ఓపెన్‌జిమ్ ఏర్పాటు, పద్మానగర్ ఫేజ్-1లో రూ.లు 54 లక్షల వ్యయంతో సిమెంట్‌రోడ్డు నిర్మాణం, కల్పన సొసైటీలో రూ.లు.26.60లక్షల వ్యయంతో సిమెంట్‌రోడ్ నిర్మాణం పనులు, మధుసూధన్‌రెడ్డినగర్‌లో రూ.లు.25లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు, ద్వారకాపురి కాలనీలో రూ.లు.36.40లక్షల వ్యయంతో సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కుత్బుల్లాపూర్ టిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్‌యాదవ్, డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్ స్వామి, ప్రధానకార్యదర్శి సత్తిరెడ్డి, బోలోజు కిశోర్‌చారి, నార్లకంటి రమేశ్‌యాదవ్, నార్లకంటి బాలయ్యయాదవ్, పెంటయ్య ముదిరాజ్, ఆయా సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చార్మినార్, నవంబరు 13 ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం ఆరాంఘర్ మెట్రో క్లాసిక్ గార్డెన్ నుంచి బుద్వేల్ వెళ్లటానికి రహదారిని దాటేందుకు ప్రయత్నిస్తున్న జగత్ సింగ్ అనే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది.కాగా జగత్ సింగ్‌ఈ సంఘటనలో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన అజిత్ సింగ్ మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు.


దసరా దీపావళి కుర్మ సంఘం ఆధ్వర్యంలో జరిగిన క్రీడా స్పోర్ట్స్ కార్యక్రమంలో పాల్గొన్న కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎగ్గే మల్లేశం, కురుమ సంఘం ప్రతినిధఉలు రఘువీర్‌కురుమ, కాలే అమర్‌నాథ్, మాజీ స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రేమ్‌రాజ్, టి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

## సెల్‌ఫోన్లు చోరీ

పేట్‌బషీరాబాద్,నవంబర్13 ప్రభాతవార్త: తమ సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయని భాదితులు ఆదివారం పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బీహార్ రాష్ట్రానికి చెందిన రంజిత్‌కుమార్, రాకేష్‌కుమార్, శ్రీరామ్ అనే ముగ్గురు వ్యక్తులు నగరానికి వలస వచ్చి ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈనెల 6న ముగ్గురు వ్యక్తులు ఉద్యోగం చేసి ఇంటి వచ్చిన తరువాత తమ సెల్‌ఫోన్లను తల దిండు కిందపెట్టుకొని పడుకున్నారు. మరుసటి రోజు తెల్లవారుజామున 6గంటల సమయంలో తమ సెల్‌ఫోన్లను వెతుకగా కనిపించడంలేదని, అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించి ఉంటారని అనుమానంతో పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## వైద్యులు వ్యాపార దృక్పథంతో కాకుండా పేదలకు తమ వంతు భాధ్యతగా సేవలు అందించాలి

### వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, నవంబర్ 13, ప్రభాతవార్త : వైద్యులు వ్యాపారదృ కృథంతో కాకుండా పేదలకు తమ వంతు భాధ్యతగా సేవలు అందించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ టిఆర్ఎస్ అధ్యక్షులు శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ అన్నారు. ఆదివారం యూసుఫ్‌గూడ ప్రధానరహదారిలో మాక్స్ ఎయిడెడ్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సంలో వారు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా తరువాత అందరికి అందుబాటులో ఉండే ఆసుపత్రుల అవసరం చాలా పెరిగింది అన్నారు.అన్ని సదుపాయాలతో అనువైన ప్రదేశంలో అందరికి అందుబాటులో ఉండే ఇటువంటి ఆసుపత్రిని తమ నియోజకవర్గంలో తమ చేతుల మీదుగా ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వైద్య రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన వైద్య బృందం అత్యాధునిక టెక్నాలజీతో అందరికి అందుబాటులో ధరలతో అన్ని వసతులు కార్పోరేట్ స్థాయిలో ఒకే చోటులో ఉంటే విధంగా ఈఆసుపత్రిని ప్రారంభించడం జరిగిందన్నారు. ఇందులో ఐసీయు ఎమర్జెన్సీ సిటీ స్కాన్ 24గంటలు పనిచేస్తూ ఉండటం తమ ప్రత్యేకతగా వైద్యశాల ఎమ్‌డి సంపత్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్లు సాహస కుమార్, డాక్టర్ మిత్రారామ్‌రెడ్డి, డాక్టర్ పవన్ కుమార్‌రెడ్డి, డాకస్టర్ సుదీర్ వైద్యులు మహేందర్ వంశీ, స్వేత, గోపి, షాజహాన్, తదితరుల పాల్గొన్నారు.

## బాలలే నేటితరానికి ఆశాజ్యోతులు

### సిరికొండ మధుసూదనాచారి



నాంపల్లి, నవంబరు 13 ప్రభాతవార్త : బాలలే నేటితరానికి ఆశాజ్యోతులు, నవనిర్మాణ క్రాంతులని తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. కళాపోషకుడు, సంఘసేవకుడు, నిగర్వి, బాలలంటే ఎంతగానో అభిమానించే యలవర్తి రాజేంద్రప్రసాద్‌ను స్మరించుకొంటూ ఆయన దివ్యస్మృతికి నీరాజనంగా బాలల దినోత్సవా న్ని పురస్కరించుకొని శిఖరం ఆర్ట్ థియేటర్స్, శంకరం వేదిక సంయుక్త నిర్వహణలో శిఖరం అధ్యక్షుడు గొల్లకృష్ణ నేతృత్వంలో, డా. ఎం.కె.రాము సభాధ్యక్షతన బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మధుసూదనాచారి విశిష్ట అతిథులు సిఐ ఎ.సత్తయ్య, యలవర్తి ధనలక్ష్మి తదితరులతో కలిసి ప్రతిభావంతు లైన బాలబాలికలకు బాలతేజం పురస్కారాలను ప్రదానం చేశారు.

## అబ్దుల్లాపూర్‌మెట్‌లో పేదల గుడిసెల తొలగింపు.. ఉద్రిక్తత

### వందల సంఖ్యలో పోలీసు బలగాలు

### గుడిసెలను నేలమట్టం చేసిన రెవెన్యూ అధికారులు

### ప్రతిఘటించిన మహిళలు.. చెదరగొట్టిన పోలీసులు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 13 ప్రభాతవార్త : అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో పేదలు వేసుకున్న గుడిసెల తొలగింపు తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. అబ్దుల్లాపూర్ సర్వేనెంబర్ 283లోని ప్రభుత్వ భూమిలో గత పన్నెండు సంవత్సరాల క్రితం గ్రామంలోని ఇళ్లులేని నిరుపేదలకు అప్పటి ప్రభుత్వం ఇందిరమ్మ పట్టాలు జారీ చేసినప్పటికీ నేటి వరకూ స్థలాలను కేటాయించలేదు. దీంతో గ్రామానికి చెందిన సుమారు 570 మంది నిరుపేదలు తమకు కేటాయించిన భూమిలో గుడిసెలు వేసుకుని 30రోజులుగా అక్కడే ఉంటున్నారు. వీరికి సీపీఎం పార్టీ మద్దతు తెలుపుతుండగా అక్కడ పేదలందరూ చెట్లను తొలగించుకుంటూ తమ గుడిసెలను కాపాడుకుంటు వస్తున్నారు. అయితే ఆదివారం తెల్లవారుజామున వందలాది మంది పోలీస్ బలగాలతో రెవెన్యూ అధికారులతో గుడిసెల వద్దకు చేరుకుని జేసీబీల సహాయంతో తొలగించడానికి ప్రయత్నిస్తుండగా అప్పటికే గుడిసెల సమూహం వద్ద జమ అయిన వందలాది మంది గ్రామానికి చెందిన నిరుపేద మహిళలు పోలీసులను, జెసీబీలను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, పేదలకు మధ్య కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు సీపీఎం నాయకులు, మహిళలను, గ్రామస్థులను కొందమందిని అరెస్ట్ చేసి, అక్కడినుంచి అందరినీ చెదరగొట్టారు. అనంతరం గుడిసెలను జెసీబీలతో నెలమట్టం చేయించారు.

**అసైన్డ్ భూముల్లోని ఇళ్లను నేలమట్టం..** గుడిసెల తొలగింపుకు ముందుగానే ఇదే సర్వేనెంబర్‌లోని అసైన్డ్ భూముల్లో నోటరీ డాక్యుమెంట్ల ద్వారా ప్లాట్లు కొనుగోలు చేసుకుని నిర్మించుకున్న సుమారు 40ఇళ్లను అధికారులు నేలమట్టం చేశారు. ఆయా ఇళ్లల్లో కొంతమంది నివాసముంటున్నప్పటికీ, మరి కొన్ని ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. అయితే ఇళ్లల్లో నివాసముంటున్న వారిని ఇళ్లల్లోంచి బయటకు లాగి, వారి సామాగ్రిని బయటకు తీసి ఇళ్లన్నింటిని నేలమట్టం చేశారు. తాము పేద కుటుంబాలకు చెందిన వారిమని, అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నామంటూ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకుండా తమ ఇళ్లను అధికారులు నిర్దాక్షిణంగా కూల్చివేయడం సరైంది కాదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


జెసిబిలతో గుడిసెలను తొలగిస్తున్న పోలీసులు

**రోడ్డెక్కిన మహిళలు, పీఎస్ ముందు భైఠాయింపు..** గత 30రోజులుగా తాము వేసుకున్న గుడిసెలను పోలీసు బలగాలతో వచ్చిన రెవెన్యూ అధికారులు బలవంతంగా కూల్చివేయించారని ఆరోపిస్తూ వందలాది మంది మహిళలు విజయవాడ జాతీయ రహదారిపై భైఠాయించి రోడ్డుకు ఇరువైపులా వాహనాలను అడ్డుకుని పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. దీంతో పాటు సీపీఎం నాయకులను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ పోలీస్‌స్టేషన్ ముందు భైఠాయించి పోలీసులు డౌన్..డౌన్, ఎంఆర్‌ఓ డౌన్..డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయగా పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళన చేస్తున్న వారిని చెదరగొట్టారు.

**సొమ్మసిల్లిన పలువురు మహిళలు..** రెవెన్యూ అధికారులు తమ గుడిసెలను ఆదివారం తెల్లవారుజామున కూల్చివేస్తారన్న సమాచారాన్ని తెలుసుకున్న మహిళలు శనివారం రాత్రి నుంచి అక్కడే ఉండి పోలీసులు, రెవెన్యూ అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కాగా పోలీసులు ఎక్కువ మంది ఉండడంతో మహిళలకు పోలీసులకు మధ్య కొంతసేపు పెనుగులాట చోటుచేసుకుంది. ఈఘటనలో పలువురు మహిళలకు గాయాలు కాగా, ఇద్దరు మహిళలు సొమ్మసిల్లి పడిపోవడంతో స్థానిక ఆసుపత్రిలో చికిత్స కోసం తరలించారు.

## గోల్నాక డివిజన్‌లో అర్ధరాత్రి వేళల్లో కూడా పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న దూసరి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, నవంబరు 13 ప్రభాతవార్త: గోల్నాక డివిజన్‌లో అర్ధరాత్రి వేళల్లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ కార్యక్రమాలను అంబర్‌పేట నియోజకవర్గం టిఆర్ఎస్ నేత దూసరి శ్రీనివాస్‌యాదవ్ స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు పరిశీలిం చారు. డివిజన్‌లోని డిమార్ట్ నుంచి జిందాతిలస్మత్ వరకు, గోల్నాక కొత్తబ్రిడ్జ్ నుంచి గోల్నాక చౌరస్తా వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను కూడా సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.


ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నాట్య ప్రదర్శన నిర్వహించారు.

## బిజెపికి కుమ్మరి శ్రీను కుటుంబ సభ్యుల రాజీనామా

చిక్కడపల్లి, నవంబరు 13 ప్రభాతవార్త: రామ్‌నగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆపార్టీ కార్యవర్గసభ్యుడు కుమ్మరి శ్రీనుతో పాటు అతడి భార్య ప్రస్తుతం రామ్‌నగర్ డివిజన్ మహిళామోర్చ సభ్యురాలు కుమ్మరి స్వరూప, ఆమె కుమారుడు డివిజన్ పార్టీ దళితమోర్చ అధ్యక్షుడిగా పనిచేస్తున్న సాయికుమార్ కూడా పార్టీకి రాజీనామా చేశారు.


**వార్త CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ I, SATHAVALLI SWAMY VEERA BHADRANAND S/o Soma Sekhar, Aged 72 Yrs Residing At 6-23/86, Ksr Township, Kundana pally, Secunderabad 501301 Has Changed The Name From Sathavalli Bhadranand To **Sathavalli Swamy Veera Bhadranand** Via Affidivit No 34aa 272217.

(Ro.No.38911)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు

IN THE COURT OF THE HON'BLE XX JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD
O.S.No.1840 of 2021

**Between:-**
Munimala Adithya and another ....Plaintiffs
**AND**
Munimala Purushotham and others ...**Defendants**

**To,**
B.Srinivas S/o Late B.Sadanand, Aged about 54 years, Occ: Private Employee, R/o.H.No. 3-3-868/1,Kuthbiguda, Hyderabad T.S.

**SUMMONS**

It is hereby take summons that the Plaintiffs filed above case to Declare the Gift cum Settlement Deed vide Document No.3306 of 2001 dated: 12.11.2001 as null and void and to cancel the said document. And to direct the defencant No.3 & 5 to vacate the Suit Schedule Property and to hand over the Physical Possession of the same to the Plaintiffs. And to grant Perpetual Injunction restraining the defendant No.1, 3 & 5 and their agents, servants, authorized persons, GPA holder from alienating the Suit Schedule Property either part or whole and for restraining the defendant No.6 to 8 from registering any document. And direct the defendant No.6 to deposit the monthly rent of **Rs.4,500-00** before the Hon'ble Court.The said case is posted on **18-11.2022 at 10.30 AM** in the above mention court for your appearance in person or through the Advocate and if you failed to appear in above mention date, other wise matter will be decided accordingly.

**SCHEDULE OF PROPERTY**

All that the part and parcel of house property bearing No.3-3-868/1, admeasuring 64-00Sq. Yards consisting with ground and first floor situated in Kutbiguda, Nampally Mandal, Hyderabad and bounded by: **NORTH:** 20" Wide Road, **SOUTH:** House No.3-3-868, **EAST:** 14" Wide Road, **WEST:** House No.3-3-867.

(BY ORDER OF THE COURT)
Sd/-MUMTHAJ ILLANI KHAN, P.VINOD, Advocate
(0) Situated at Dabeerpura, Hyderabad.
Mob:9866583413.

IN THE COURT OF THE HON'BLE XX JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD
I.A.No.239 of 2022
IN
O.S.No.1840 of 2021

**Between:-**
Munimala Adithya and another ....Petitioners/Plaintiffs
**AND**
Munimala Purushotham and others ...**Respondents/Defendants**

**To,**
B.Srinivas S/o Late B.Sadanand, Aged about 54 years, Occ: Private Employee, R/o.H.No.3-3-868/1,Kuthbiguda, Hyderabad T.S.

**NOTICE**

It is hereby take Notice that the above named Petitioners filed Petition for seeking relief of interim injunction restraining respondent No.3 & 5 and their GPA Holders, Agents, Subordinates, third parties claiming through them or any other person or persons, or acting under them from alienating the Petition Schedule Property either in part or in whole.

The said case is posted on **18-11.2022 at 10.30 AM** in the above mention court for your appearance in person or through the Advocate and if you failed to appear in above mention date, other wise matter will be decided accordingly.

**SCHEDULE OF PROPERTY**

All that the part and parcel of house property bearing No.3-3-868/1, admeasuring 64-00Sq. Yards consisting with ground and first floor situated in Kutbiguda, Nampally Mandal, Hyderabad and bounded by: **NORTH:** 20" Wide Road, **SOUTH:** House No.3-3-868, **EAST:** 14" Wide Road, **WEST:** House No.3-3-867.

(BY ORDER OF THE COURT)
Sd/-MUMTHAJ ILLANI KHAN, P.VINOD, Advocate
(0) Situated at Dabeerpura, Hyderabad.
Mob:9866583413.

# బ్రాహ్మణుల సంక్షేమానికి చేయూత: మంత్రి సబితారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి: పక్కన ఎమ్మెల్సీ వాణిదేవి

**సరూర్‌నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో బ్రాహ్మణుల సంక్షేమానికి సహకరిసు_్తన్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం బడంగ్‌పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ బ్రాహ్మణుల అభ్యున్నతికి సిఎం కెసిఆర్ కృషి చేస్తున్నారనీ ఆయనస్ఫూర్తితో నియోజకవర్గంలో బ్రాహ్మణుల సంక్షేమానికి చేయూతనిస్తున్నామన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో బ్రాహ్మణుల సౌకర్యార్థం బ్రాహ్మణ భవన్‌ను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలచారి, మాజీఎమ్మెల్సీ రామచందర్‌రావు, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కార్పొరేటర్ రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యుడు హనుమంతచారి, బడంగ్‌పేట్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మంగు రాఘవరావు, విరాట్ స్వరూప్, బల్లమూడి రాంబాబుతోపాటు మురుకుంట్ల అరవింద్‌శర్మ, పంతంగి మాధవి వెంకటేశ్వరరావు, పలువురు బ్రాహ్మణ కుటుంబాల వారు పాల్గొన్నారు.

## ఘనంగా పంచముఖ ఆంజనేయ స్వామి, శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం



బ్రహ్మోత్స వాలలో పాల్గొన్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తదితరులు

**తుర్కయంజాల్, నవంబర్ 13 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 23వ వార్డు లక్ష్మీనగర్‌కాలనీలోని శ్రీ పంచముఖ ఆంజనేయ సమేత శ్రీ రామచంద్ర స్వామి దేవస్థానంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కేతావత్ జయరామ్‌గురుస్వామి ఆధ్వర్యంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తునానరు. ఈ బ్రహ్మోత్సవాలకు ముఖ్యఅతిథిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, డిసిసిబి వైస్‌చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రామావత్ కళ్యాణ్‌నాయక్, నాయకులతో కలిసి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో దైవ నామస్మరణ చేస్తే మానసిక ప్రశాంతతో పాటు సకల సంపదలు చేకూరుతాయని ఆయన తెలిపారు. అదే విధంగా మునగనూరు మల్లన్నగుట్ట పరిధిలో కార్తీక మాసం వనభోజన మహోత్సవాలలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, కందాడ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు తాళ్లపల్లి సంగీతమోహన్‌గుప్తా, వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి, బల్దేవ్‌రెడ్డి, సంజీవరెడ్డి, మున్సిపాలిటీ టిఆర్‌ఎస్ అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి, రాకేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మహిళకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**వనస్థలిపురం, నవంబర్ 13 ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలో శ్రీ సాయితేజస్వీ పాలిక్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలు నివాసముండే బస్తీలు, మురికివాడలలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి సేవలందిస్తే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. శిబిరంలో సుమారు 250 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసారు. అంతేకాకుండా రూ. 4500 విలువ గల బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు 125 మందికి నిర్వహించారు. ఈ శిబిరంలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, వైదు ్యలు యుమునాదేవి, కుమార్‌భాను,కోట్ల బాలరాజు, ఆసుపత్రి డైరెక్టర్ వీరస్వామి, శ్రీనివాస్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## లాలాపేట్ పోచమ్మ ఆలయానికి స్థలం వదిలి నిర్మించాలని వినతి



పద్మారావుగౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆంజనేయులు

**తార్నాక, నవంబర్ 13 ప్రభాతవార్త:** లాలాపేట్ పోచమ్మ ఆలయానికి ఇబ్బంది కలుగకుండా స్థలాన్ని వదిలి మల్టిపర్పస్ హాల్ నిర్మించాలని కోరుతూ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌కు లాలాపేట్ కుమ్మరి సంఘం నాయకులు ఆంజనేయులు వినతి పత్రాన్ని అందజేశారు. ఆలయం ముందు కొంత స్థలాన్ని వదిలిని తరువాతనే జిహెచ్‌ఎంసి నిర్మిస్తున్న మల్టిపర్పస్ హాల్‌ను నిర్మించాలని ఆయన డిప్యూటీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. హాల్ నిర్మాణం చేయడాన్ని తాము వ్యతిరేకించడం లేదని భక్తులకు ఇబ్బంది కలుగకుండా కొంత మేర స్థలం వదిలిన తరువాత నిర్మించుకోవాలని ఆయన కోరారు.

## తెలంగాణాలో బిజెపి జెండా ఎగురవేస్తాం: సురేందర్‌రెడ్డి



మోడీకి వీడ్కోలు పలుకుతున్న సురేందర్‌రెడ్డి

**మలక్‌పేట, నవంబర్ 13 ప్రభాతవార్త:** తెలంగాణాలో బిజెపి జెండా ఎగురవేస్తామని భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ కర్మాగారాన్ని ప్రధాని మోడి జాతికి అంకితం చేసి ఢిల్లీకి బయలుదేరిన ప్రధానిమోడికి బేగంపేట విమానాశ్రయం వద్ద సురేందర్ రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని ప్రజల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అవినీతి కుటుంబ పాలనతో ఒక కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందిందని ఆరోపించారు. దుర్మార్గపు పాలన అంతం చేయడమే బిజెపి లక్ష్యమని అన్నారు.

## ఈ నెల 17న నెక్లెస్ రోడ్డులో 'వాక్ ఫర్ గోమాత' ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

**సైదాబాద్, నవంబరు 13 ప్రభాతవార్త:** అఖిల భారత గో సేవ ఫౌండేషన్, పంచగవ్య డాక్టర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు పీపుల్స్ ప్లాజా నెక్లెస్ రోడ్‌లో 'వాక్ ఫర్ గో మాత' ర్యాలీని నిర్వహిస్తున ్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. ఆదివారం ఆయన సైదాబాద్‌లో మాట్లాడుతూ పంచగవ్య చికిత్స విధానం ద్వారా ఆవు మూత్రం, ఆవు పేడ, పాలు, పెరుగు, నెయ్యిలను ఉపయోగించి ఆరోగ్యాన్ని ఏవిధంగా కాపాడుకోవచ్చో ప్రజలందరికి తెలియజేయడం ఈ ర్యాలీ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని బాలకృష్ణ తెలిపారు. గోవులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యోగేష్ ప్రభు, లోకేష్ యాదవ్, రవి, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, మల్లేష్, రాములు, సంతోష్, కల్పన, గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చతుర్దశ వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు వేడుకలు

**సైదాబాద్, నవంబరు 13 ప్రభాతవార్త:** సైదాబాద్ వినయ్ నగర్ కాలనీలోని శ్రీ విజయ వినాయక దేవాలయం చతుర్దశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిసాయి. ఆదివారం గురువందనం, అష్టోత్తర మహాకలశ స్నపనము, కుంభాభిషేకము, ఆవాహిత దేవతా పూజలు, నవగ్రహ హోమం, విశేష పుష్పార్చన, బలిప్రదానం, మహాపూర్ణాహుతి, మంగళహారతి, సంప్రోక్షణ ఆశీర్వచనము ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మాధికారి చీకోటి ప్రవీణ్‌కుమార్‌గుప్త, డైరెక్టర్లు శ్రీనివాస్‌గౌడ్, నిమ్మ రవీందర్‌రెడ్డి, సుమిత్ర, అరుణ, చంద్రమౌళి గుప్త, బాలు మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

**ఎల్.బి.నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త :** లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్, స్నేహ ఫౌండేషన్ సహకారముతో ఆర్‌కేపురం డివిజన్ సౌభాగ్యపురం పర్మనెంట్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సాధూరాం కంటి ఆసుపత్రి, భాగ్యలత ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి పరీక్షలు చేసి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయడంతో పాటు కంటి శుక్లాలు ఉన్న వారికి ఉచిత ఆపరేషన్లు చేశారు. శిబిరంలో ఉచితంగా షుగర్, బీపీ, కొలెస్ట్రాల్ పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురండివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు లక్ష్మిప్రసన్న, జిన్నారం విట్టల్‌రెడ్డి, ఎల్‌బినగర్ టిఆర్ఎస్ ఇంచార్జి ముదగోని రామ్‌మోహన్‌గౌడ్ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ హెల్త్ క్యాంపు చైర్మన్ డాక్టర్ బి.విజయరంగా అతిధులను స్నేహ ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాన్వి అనురాధ, సుబ్రహ్మణ్యం, జ్యోతి, కృష్ణమోహన్‌రెడ్డి, గీత, జితేంద్రదేవి పాల్గొన్నారు.

## టిఆర్ఎస్‌లో చేరిన లెనిన్‌నగర్ కాంగ్రెస్, బిజెపి నేతలు

**సరూర్‌నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ కార్పొరేషన్‌లో అతిపెద్ద వీకర్ సెక్షన్ కాలనీ లెనిన్‌నగర్ నుండి ఆదివారం పలువురు కాంగ్రెస్, బిజెపి నాయకులు, కార్యకర్తలు టిఆర్ఎస్ పార్టీలో చేరారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కె.సుధాకర్, ప్రభు, పవన్, అర్జున్, రఘులతో పాటు దాదాపు 100మంది టిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వారికి కండువాలువేసి ఆహ్వానించా రు. ఈ కార్యక్రమంలో మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## నేడు వనస్థలిపురంలో ఉచిత వైద్య శిబిరం

**వనస్థలిపురం, నవంబర్ 13 ప్రభాతవార్త:** ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ మధుమేహ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం వనస్థలిపురంలోని శ్రీ కృష్ణ డయాబెటీస్, ఎండోక్రైన్ సెంటర్‌లో ఉచితంగా మధుమేహ పరీక్షలు నిర్వహించబడతాయని ఆసుపత్రి ఎండి డాక్టర్ నాగేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆసుపత్రి ప్రాంగణంలో ఉదయం 7 గంటలనుండి 9 గంటలవరకు బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించబడతాయని, అనంతరం రోజురోజుకు పెరుగుతున్న మధుమేహంపై అవగాహన కల్పించడంతోపాటు, వాటివల్ల వచ్చే ఇతర సమస్యలను నివారించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని డాక్టర్ నాగేందర్‌రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని కాలనీవాసులు సద్వినియోం చేసుకోవాలని ఆయన కోరారు.

## టీఆర్ఎస్ ప్రభుత్వంతో అన్ని వర్గాల సంక్షేమం: ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



వాలీబాల్ ఆడుతూ క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి చిత్రంలో ఎమ్మెల్యే కిషోర్ తదితరులు

**హయత్‌నగర్, నవంబరు 13 ప్రభాతవార్త:** టీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషిచేస్తోందని పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి 5వవార్డు సదాశివ ఎన్‌క్లేవ్‌లో 5 లక్షల రూపాయలతో ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్య, వైద్యం, క్రీడలు, మౌళిక వసతుల కల్పనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అనంతరం కాలనీలో నిర్మించిన కమ్యూనిటీ హాలును తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా కాలనీలో రోడ్లు, ఇతర సదుపాయాలను కల్పించాలని కాలనీవాసులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న, వైస్ ఛైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి, నాయకులు సిద్ధంకి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేటి నుండి గ్రంథాలయ వారోత్సవాలు

**సరూర్‌నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయసంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సోమవారం నుండి ఈ నెల 20వ తేదీ వరకు 55వ జాయతీ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని సంస్థ ఛైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి తెలిపారు. కరోనాతో పాటు ఎన్నికల నిబంధన నేపథ్యంలో గత మూడు సంవత్సరాల నుండి గ్రంథాలయ వారోత్సవాలను జరపలేదని ఈ సారి వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందని వివరించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, పాఠకులు, ప్రజలు వారోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## హెచ్‌ఎంటీ పెద్ద చెరువులో దోమల నియంత్రణకు చర్యలు: శాంతిశేఖర్

**నాచారం, నవంబర్ 13 ప్రభాతవార్త:** హెచ్‌ఎంటీ పెద్ద చెరువులో దోమల నియంత్రణకు తరుచు చర్యలు తీసుకుంటున్నామని కార్పోరేటర్ సాయిజన్ శాంతిశేఖర్ పేర్కొన్నారు. కాప్రా జిహెచ్‌ఎంసీ సిబ్బందితో కార్పోరేటర్ చెత్తచెదారాన్ని ప్రత్యేక డ్రోన్ సహాయంతో యాంటి లార్వా స్ప్రే చేయించారు. త్వరలో గుర్రపు డెక్కలను తొలగించే ఎఫ్‌టిసి యంత్రాన్ని హెచ్‌ఎంటీనగర్ చెరువులో ప్రారంభించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సాయిజన్ శేఖర్, ఎంటమాలజీ ఎస్సీ గంగప్ప, ఏఇ,రమేష్, సూపర్ వైజర్ నరసింహ్మా, మేకల ముత్యం రెడ్డి, విఠల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, అశోక్ తుంగ సువర్ణ, సుగుణాఖర్ రావు, శివ చంద్ర శేఖర్, హరిప్రసాద్, జయరాజ్, శ్రీనివాస్, ఉజ్వల్ పాల్గొన్నారు.

## కార్తీక వన భోజనాలకు ఎంతో ప్రాధాన్యత: కార్పొరేటర్లు

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** కార్తీక మాస వన భోజనాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని కార్పొరేటర్లు బన్నాల గీత ప్రవీణ్, బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ కమ్మ సంఘం అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి రమేష్‌ల ఆధ్వర్యంలో కార్తీక మాస వన భోజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితోపాటు, కార్పొరేటర్లు బన్నాల గీత ప్రవీణ్, బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసంలో వన భోజనాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఆధ్యాత్మిక చింతనతోపాటు, ఆనందం, ఆరోగ్య సందేశం ఉందన్నారు. సంస్కృతి, సంప్రదాయానికి వన భోజనాలు ప్రతీకగా నిలుస్తాయన్నారు. అనంతరం కమ్మ సంఘం మహిళలు, నేతలు ఆటపాటతో ఆడిపాడి ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం నేతలు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీకి అందెల వీడ్కోలు



ప్రధానికి వీడ్కోలు పలుకుతున్న అందెల

**సరూర్‌నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త:** రాష్ట్ర పర్యటనను పూర్తిచేసుకొని శనివారం రాత్రి ఢిల్లీ తిరుగు ప్రయాణమైన ప్రధాని నరేంద్రమోడికి మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ ఘనంగా వీడ్కోలు పలికారు. బేగంపేట్ విమానాశ్రయానికి తరలి వెళ్ళిన అందెల అక్కడ ప్రధానిని కలిసి మర్యాదపూర్వకంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ప్రధానిని కలిసిన అనంతరం ఆయన మాట్లాడుతూ మోడి పర్యటన బిజెపి క్యాడ్‌లో కొత్త జోష్‌ను నింపిందని అన్నారు.

## దూర విద్యతో భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శంకర్

**హయత్‌నగర్, నవంబరు 13 ప్రభాతవార్త:** రెగ్యులర్ డిగ్రీ చదవలేని వారు దూరవిద్యను అభ్యసించడం ద్వారా తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ హయత్‌నగర్ సెంటర్ కో-ఆర్డినేటర్ శంకర్ అన్నారు. హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కో-ఆర్డినేటర్ సెంటర్‌లో ఆదివారం డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమానికి హాజరైన కౌన్సిలర్లు రాకేశ్‌భవాని, జాహెదాబేగం, శంకర్ మాట్లాడుతూ దేశంలో తక్కువ ఫీజుతో సాంకేతిక పరిజ్ఞానంతో అంబేద్కర్ యూనివర్సిటీ ఉన్నత విద్యను అందిస్తోందన్నారు. విద్యార్థులు దూరవిద్యపై ఎలాంటి అపోహలకు పోరాదన్నారు. రెగ్యులర్ డిగ్రీతో సమానంగా అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ అన్ని అర్హత పరీక్షలు, ఉద్యోగాలకు వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కృష్ణ, జానారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, నాగయ్య పాల్గొన్నారు.

## ఏళ్ళు గడిచినా అభివృద్ధి లేదు.. రెండున్నర ఏళ్ళలో సాధ్యమైనంత చేశా: మేయర్ పారిజాత



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త:** కాలనీలు ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోలేదనీ అయితే గడచిన రెండున్నర సంవత్సరాల్లో సాధ్యమైనంత అభివృద్ధిని చేశామని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం కిందకు వచ్చే బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని తన స్వంత డివిజన్ 31కి సంబంధించిన శ్రీ సాయి బాలాజీ హోమ్స్ ఫేజ్ 1, 2లలో ఆదివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇక్కడి కాలనీలుఏర్పడి సుమారు 10 సంవత్సరాలు గడస్తున్నా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయనీ అయితే గత రెండున్నర ఏళ్ళలోనే స్థానిక ప్రజలకు రోడ్లు, డ్రైనేజీ, తాగు నీరు తదితర మౌళిక సదుపాయాలను తాము కల్పించామని వివరించారు. ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమైందనీ మున్ముందు మరింత అభివృద్ధి చేస్తామని పారిజాత స్పష్టం ఏశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో మెగా ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన



వైద్య శిబిరంలో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ శ్రీవాణి, ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ హైదరాబాద్ మీర్‌పేట, మేడ్చల్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ట్రస్ట్ సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి, చిలుకానగర్ డివిజన్ టిఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎసిపి పింగళి నరేష్‌రెడ్డి, సిఐ ఆర్.గోవిందరెడ్డి, లయన్స్‌క్లబ్ డిస్టిక్ గవర్నర్ చింతల వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ జర్నలిస్టులు సమాజహితంకోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని అభినందించారు. ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు చేసి పేద ప్రజలకు ఉచితంగా మందులు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో సుమారు 540మందికి పరీక్షలు నిర్వహించి 200మందికి కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వేణుగోపాల్‌శర్మ, లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ హరీష్‌రెడ్డి, కృష్ణప్రసాద్, టిఆర్ఎస్ నాయకులు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, పార్టీల నేతలు పాల్గొన్నారు.

## ఉపేందర్‌గుప్త సేవలు అభినందనీయం: డాక్టర్ భార్గవ



మాట్లాడుతున్న డాక్టర్ భార్గవ గురుస్వామి

**సైదాబాద్, నవంబరు 13 ప్రభాతవార్త:** పుల్లూరి అనంతలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మాలధారులకు మండలకాలం అల్పాహారాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని జ్యోతిష్య పండితులు డాక్టర్ భార్గవ గురుస్వామి అన్నారు. చంపాపేటచౌరస్త సమీపంలోని జెఎస్ఆర్ స్విమ్మింగ్‌పూల్ పక్కన ఉన్న ఎస్.వి.ప్లీసంట్ అపార్ట్‌మెంట్‌లో నవంబరు 12వ తేదీ నుంచి మండల కాలం రాత్రి 9 గంటల నుంచి 10గంటలవరకు అయ్యప్ప మాలధారులకు అల్పాహారాన్ని అందిస్తున్నారు. శనివారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం డాక్టర్ భార్గవ గురుస్వామి మాట్లాడుతూ పుల్లూరి అనంతలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత అయిదేళ్లుగా నీలోఫర్, నిమ్స్, గాంధీ ఆసుపత్రి, ఎన్టీఆర్ గార్డెన్స్, చిలుకూరి బాలాజి దేవాలయం సమీపంలో ప్రతి రోజు వేలాది మందికి అన్నదానంచేస్తున్న ఉపేందర్ గుప్త అభినందనీయుడన్నారు. కార్యక్రమంలో మల్యాద్రి, గోపాల్ యాదవ్, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీకాంత్, గిరి, శివ, గణేష్‌రెడ్డి, సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో కార్పొరేటర్ రజితరెడ్డి పర్యటన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్‌లోని సత్యనగర్, న్యూశాంతినగర్‌కాలనీలో ఆదివారం కార్పొరేటర్ మందముల్ల రజితపరమేశ్వర్‌రెడ్డి అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు కాలనీలలో జరుగుతున్న సిసి రోడ్లు, డ్రైనేజీ పనులను ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పనులు వెంటనే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. కాలనీలో దోమల బెడద, విద్యుత్ స్థంభాలు తదితర సమస్యలు పరిష్కరించాలని స్థానికులు సూచించారు. కార్యక్రమంలో కాలనీ సంఘం నేతలు పోగుల ఎల్లారెడ్డి, విజయ్, తుమ్మల దేవిరెడ్డి, సల్ల ప్రభాకర్‌రెడ్డి, పోగుల భాస్కర్‌రెడ్డి, సంజీవరెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, సత్తిరాజు, భవానీ, దానలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## దశలవారిగా అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే అహ్మద్ బలాల



చంచల్‌గూడలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల, షాహిద్ తదితరులు

**మలక్‌పేట, నవంబర్ 13 ప్రభాతవార్త:** మలక్‌పేట నియోజకవర్గంలో దశలవారిగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. చావుని డివిజన్ చంచల్‌గూడ ఇబ్రహీం ఫంక్షన్ హాల్ లేన్‌లో జరుగుతున్న సిసి రోడ్డు, సివరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బలాల, డివిజన్ కార్పొరేటర్ సాలం షాహిద్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులకోసం ప్రతిపాదనలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ మల్లికార్జున్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## మాతృదేవోభవ సేవతో మామూలు మనిషి అయిన అభాగ్యుడు: గిరి



పంకజ్‌ను తండ్రికి అప్పగిస్తున్న మాతృదేవోభవ గిరి

**సరూర్‌నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త:** రోడ్లపై తిరుగుతున్న అభాగ్యులను చేరదీస్తున్న నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాధాశ్రమం పుణ్యమా అని మతి స్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తి సాధారణ స్థితికి చేరుకొని మామూలు మనిషి అయ్యాడు. ఈ నేపథ్యంలో ఆశ్రమ నిర్వాహకుడు గట్టు గిరి సదరు వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. రెండున్నర సంవత్సరాల క్రితం మతిస్థిమితం లేని స్థితిలో ఓ వ్యక్తి రోడ్లపై తిరుగుతుండడంతో మాతృదేవోభవ ఆశ్రమం వారు చేరదీసి వసతి, భోజన సేవలతో పాటు వైద్య సేవలను అందజేశారు. దీంతో 5రోజుల క్రితం సదరు వ్యక్తి తన పేరు పంకజ్‌కుమార్ అనీ తన స్వగ్రామంతో పాటు కుటుంబ సభ్యుల వివరాలను చెప్పాడు. ఈ నేపథ్యంలో గిరి పంకజ్ కుటుంబం పేదదైనందున రూ.6వేలు రవాణా ఖర్చులుపంపి వారిని రప్పించి పోలీసుల సమక్షంలో పంకజ్ ను అప్పగించాడు. అంతే కాకుండా పంకజ్‌ను తీసుకుపోవ డానికి వచ్చిన తండ్రిని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వరకు సాగనంపారు.

## గౌడ, శెట్టి బలిజల సమస్యల పరిష్కారానికి కృషి: ముద్దగౌని



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న రామ్మోహన్‌గౌడ్ తదితరులు

**వనస్థలిపురం, నవంబర్ 13 ప్రభాతవార్త:** కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వనస్థలిపురం గౌడ, శెట్టి బలిజ సంక్షేమ సంఘంఆధ్వర్యంలో ఎన్జీఓస్‌కాలనీలో ఛత్రపతిశివాజీ గ్రౌండ్‌లో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్‌బినగర్ నియోజకవర్గ టిఆర్ఎస్ ఇంఛార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న విచ్చేసారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ గౌడ, శెట్టి బలిజ సంక్షేమానికి తన వంతు కృషి చేస్తామన్నారు. వారిని బిసిలుగా గుర్తించాలని సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌ల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పివివి సత్యనారాయణ, ముద్దగౌని యాదయ్యగౌడ్, దేవేందర్‌రావు, సిహెచ్‌విఓ ప్రసాద్, సూర్యనారాయణ, వివివి సత్యనారాయణ, రామకృష్ణ, సూర్యశేఖర్, నర్సింహ్మారావు, బిటి ప్రసాద్, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 27న నిజాం విముక్త స్వతంత్ర అమృతోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**ఎల్.బి.నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త :** నిజాం విముక్త స్వాతంత్ర అమృత్సవాలలో భాగంగా ఈనెల 27న నాగోల్ శుభం కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించే యువ సమ్మేళనం పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. దిల్‌సుఖ్‌నగర్ భాగ్ సంచాలన సమితి సంయోజక్ రమేష్ మాట్లాడుతూ అమృతోత్సవాలలో భాగంగా నైజాం లొంగిపోవడానికి దారి తీసిన సంఘటనలు, పోరాట వీరుల త్యాగాలను సమాజంలోని యువతకు చేరవేయడం కోసం కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవ సమితి కార్యదర్శి, రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ శ్రీరాములు మాట్లాడుతూ పెద్ద ఎత్తున కళాశాల విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని చెరవేసి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ బాగ్ ప్రచార ప్రముఖ్ ఇందూరి రమేష్ పాల్గొన్నారు.



ప్రధాని మోడి రాష్ట్రానికి వచ్చిఆర్‌ఎఫ్‌సిఎల్ పునః ప్రారంభం, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తిరిగి వెళ్తున్న సందర్భంగా బేగంపేట విమానాశ్రయంవద్ద రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్ రెడ్డి కలిసి వీడ్కోలు పలుకుతూ అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.
(ఎల్.బి.నగర్, ప్రభాతవార్త)